ప్రాణం పోసిన **పెద్దాస్పత్రి**

● పాముకాటు నుంచి కోలుకున్న శివరామరాజు 6

80 పోస్టులు.. 584 దరఖాస్తులు

● అకడమిక్ ఇన్‌స్ట్రక్టర్లకు భారీ పోటీ

● ఎంపిక ప్రక్రియలో జాప్యం 7

బిగుస్తున్న ఉచ్చు

● శెట్టూరు మోడల్ స్కూల్ లెక్చరర్‌పై ఉన్నతాధికారులకు నివేదిక

అనంతపురం విద్య, డిసెంబరు 9 (ఆంధ్రజ్యోతి): శెట్టూరు మోడల్ స్కూల్ లెక్చరర్‌పై చర్యలకు ఉచ్చు బిగుస్తోంది. వద్దన్నా వినకుండా విద్యార్థులను విహార యాత్రకు తీసుకెళ్లడంపై ఆంధ్రజ్యోతి దిన పత్రికలో మంగళవారం ఓ కథనం ప్రచురితమైన విషయం తెలిసిందే. దీనిపై కలెక్టరు ఆనంద్‌తోపాటు మోడల్ స్కూల్ జాయింట్ డైరెక్టరు, ఆర్జేడీ సీరియస్‌గా ఆరా తీశారు. అధికారులు అనుమతి ఇవ్వకుండానే విద్యార్థులను ఎలా విహారయాత్రకు తీసికెళ్లారని జిల్లా విద్యాశాఖ అధికారులను ప్రశ్నించినట్లు సమాచారం. అదే సమయంలో ఆ లెక్చరర్ వ్యవహార శైలి, ముందు నుంచి ఉన్న వివాదాలను వారు ఉన్నతాధికారులకు క్షుణ్ణంగా వివరించారు. దీంతో మొత్తం సమాచారాన్ని నివేదిక రూపంలో పంపాలని జిల్లా అధికారులను ఆదేశించినట్లు తెలిసింది. ఈనేపథ్యంలో జిల్లా విద్యాశాఖ యంత్రాంగం, డిప్యూటీ డీఈఓ కలిసి అక్కడ ఆ లెక్చరర్ సాగించినవ్యవహారాలు, జరుగుతున్న వివాదాలపై నివేదిక తయారు చేసి ఆర్జేడీ, మోడల్ స్కూల్ జేడీకి ఆగమేఘాలమీద పంపారు. దీంతో లెక్చరర్‌పై చర్యలు తథ్యమని ఆయా వర్గాలు చర్చించుకుంటున్నాయి.

మీ ఎమ్మెల్యే బాగా పని చేస్తున్నారా?

టీడీపీ అధినాయకత్వం 'ఐవీఆర్ఎస్' ఆరా

లీడర్, కేడర్ మధ్య అంతరం తగ్గించే యత్నం

కొన్ని చోట్ల అసంతృప్తి, అసమ్మతి వెలుగులోకి..!

స్థానిక ఎన్నికలకు శ్రేణులను సన్నద్ధం చేసే దిశగా సర్వే

అనంతపురం క్రైం, డిసెంబరు 9(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో టీడీపీ నేతృత్వంలోని కూటమి ప్రభుత్వం ఏర్పడి 18 నెలలు పూర్తయింది. త్వరలో స్థానిక ఎన్నికల నిర్వహణకు సిద్ధమవుతోంది. ఈ క్రమంలో అసెంబ్లీ సెగ్మెంట్లలో మకుటంలేని మహారాజులుగా చలామణి అవుతున్న ఎమ్మెల్యేల పనితీరును తెలుసుకోవడానికి టీడీపీ హైకమాండ్ సిద్ధమైనట్లు స్పష్టమవుతోంది. నియోజకవర్గాల్లో ఎమ్మెల్యేల పనితీరు ఎలా ఉంది? బాగా పనిచేస్తున్నారా..? పర్వాలేదా...? బాగా చేయడం లేదా..? అన్న కోణాల్లో ఐవీఆర్ఎస్ ద్వారా ప్రజాభిప్రాయాన్ని సేకరిస్తున్నారు. ఇప్పటికిప్పుడు ఎన్నికలు జరిగితే ఏ పార్టీకి ఓటు వేస్తారు అని ఆరా తీస్తున్నారు. చాలా నియోజకవర్గాల్లోని ప్రజలు, పార్టీ నాయకులకు మంగళవారం ఫోన్లు వచ్చాయని తెలిసింది.

అక్కడక్కడ అసమ్మతి రాగాలు

వైసీపీ పాలనలో అనేక ఇబ్బందులు పడిన టీడీపీ సీనియర్ నాయకులు ఎందరో ఉన్నారు. కూటమి ప్రభుత్వం కొలువుదీరి 18 నెలలు గడిచినా వారికి పార్టీ పదవులుగాని, నామినేటెడ్ పదవులుగాని దక్కక తీవ్ర అసంతృప్తిలో ఉన్నట్లు తెలిసింది. కొందరు జూనియర్లకు అవకాశాలు కల్పించి, పాతికేళ్లుగా పార్టీనే నమ్ముకున్న తమకు చాన్స్ ఇవ్వలేదని (మిగతా 6లో..)



జిల్లా టీడీపీ కార్యాలయం



తరగతి గదిలో కింద పడిన పైకప్పు



పెచ్చులూడిన పైకప్పు

టైం బాగుంది..!

తరగతి గదిలో ఊడిపడిన పెచ్చులు

పై ఫొటోలు చూస్తే ప్రాణాలు పైనే పోతాయి. ఊహకందని పెనుముప్పును పిల్లలు తప్పించుకున్నారు. తరగతి గదిలో పైపెచ్చులు ఊడిపోయి కింద పడిన దృశ్యాలు చూస్తే గుండెగుభేలుమంటుంది. మధ్యాహ్న భోజన సమయంలో పిల్లలు లేకపోవడంతో పెనుప్రమాదం తప్పింది. ఉపాధ్యాయులను, తల్లిదండ్రులను బెంబేలెత్తించిన ఈ ఘటన మంగళవారం గుత్తి ఆర్ఎస్‌లోని నెంబరు-2 పాఠశాలలో చోటు చేసుకుంది. మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలలో 1 నుంచి 5వ తరగతి వరకు దాదాపు 65 మంది విద్యార్థులు విద్యనభ్యసిస్తున్నారు. 4వ తరగతి గదిలో 17 మంది విద్యార్థులు చదువుకుంటున్నారు. ఈ నేపథ్యంలో భోజన విరామ సమయంలో.. విద్యార్థులు వరాండలో భోజనాలు చేస్తుండగా ఒక్కసారిగా తరగతి గదిలో పైకప్పు నుంచి పెచ్చులూడి కిందపడ్డాయి. ఆ సమయంలో విద్యార్థులు భోజనం చేస్తుండడంతో ప్రమాదం తప్పిందని పాఠశాల హెచ్‌ఎం వీరాచారి తెలిపారు. బోధన సమయంలో పెచ్చులూడి పడి ఉంటే భారీ ప్రమాదం సంభవించేదని ఆయన ఆందోళన వ్యక్తం చేశారు. ఎలాంటి ప్రమాదం చోటు చేసుకోకపోవడంతో ఉపాధ్యాయులు ఊపిరి పీల్చుకున్నారు. ఈ విషయాన్ని ఎంఈఓకు తెలియజేసినట్లు హెచ్‌ఎం పేర్కొన్నారు. తరగతి గదులకు మరమ్మతులు చేపట్టి ఎలాంటి ప్రమాదాలు జరగకుండా అధికారులు చర్యలు తీసుకోవాలని తల్లిదండ్రులు కోరుతున్నారు.

- ఆంధ్రజ్యోతి, గుత్తి

నెట్టికంటి ఆదాయం రూ.1.07 కోట్లు

గుంతకల్లు, డిసెంబరు 9(ఆంధ్రజ్యోతి): కసాపురంలోని నెట్టికంటి ఆంజనేయస్వామి దేవస్థానానికి హుండీల ద్వారా రూ. 1.07 కోట్ల ఆదాయం లభించింది. మంగళవారం ఉదయం ఆలయ ఈఓ విజయరాజు, దేవదాయ శాఖ ఏసీ సుధారాణి సమక్షంలో హుండీలను లెక్కించారు. సాయంత్రందాకా కొనసాగిన హుండీ సొమ్ము లెక్కింపులో రూ. 1,07,33,695 నగదు, 24.200 గ్రాముల బంగారం, 1.450 కిలోల వెండి, 13 అమెరికన్ డాలర్లు, ఐదు దినార్ల విదేశీ నగదు లభ్యమైనట్లు ఆలయ ఈఓ తెలిపారు. ఈ ఆదాయం 106 రోజులపాటు హుండీల్లో భక్తులు వేసిన విరాళాల ద్వారా లభించిందని వివరించారు. రూ. కోటికి పైబడి ఆదాయం హుండీ లెక్కింపు ద్వారా లభించడం ఆలయ చరిత్రలో తొలిసారి అని ఈఓ తెలిపారు. కార్యక్రమంలో ఆలయ ఏఈఓ ఓంకారం వెంకటేశ్వరుడు, సూపరింటెండెంట్ వెంకటేశులు, సిబ్బంది రామ్మోహన్ రావు, ఎస్‌బీఐ అధికారులు, స్వచ్ఛంద సంస్థల వలంటీర్లు, స్థానికులు పాల్గొన్నారు.



కసాపురం ఆలయంలో హుండీ సొమ్మును లెక్కిస్తున్న వలంటీర్లు

ఏమిటీ నిర్లక్ష్యం..?

● మీ పిల్లలకు ఇలాగే భోజనం పెడతారా..?

● ఎస్ఎఫ్‌సీ సభ్యురాలు గంజిమాల దేవి ఆగ్రహం

● నాగసముద్రం హెచ్‌ఎంకు షోకాజ్ 6

టీడీపీలోకి కుంటిమద్ది ఎంపీటీసీ



రామగిరి, డిసెంబరు 9(ఆంధ్రజ్యోతి): రామగిరి ఎంపీపీ ఉప ఎన్నిక వేళ కీలక పరిణామం చోటు చేసుకుంది. ఎంపీపీ ఉప ఎన్నిక ఇప్పటికే నాలుగుసార్లు వాయిదా పడింది. తిరిగి ఐదోసారి ఈనెల 11న నిర్వహించడానికి నోటిఫికేషన్ విడుదలయింది. ఈ సమయంలో కుంటిమద్దికి చెందిన ఎంపీటీసీ కప్పల సాయిలీల వైసీపీకి షాక్ ఇచ్చింది. తాను టీడీపీలోకి చేరుతున్నట్టు ఆమె మంగళవారం ప్రకటించారు. గత ఐదేళ్లుగా మండలంలో ఎలాంటి అభివృద్ధి జరగలేదని, ప్రజాప్రతినిధులుగా గెలిచినా ప్రయోజనం లేకుండా పోయిందని, సరైన గుర్తింపు కూడా లేదని పేర్కొన్నారు. ప్రస్తుతం రాప్తాడు ఎమ్మెల్యే పరిటాల సునీత ఆధ్వర్యంలో మండలంలో అభివృద్ధి జరుగుతోందని అన్నారు. అందుకే తాను వైసీపీని వీడి టీడీపీలోకి చేరుతున్నట్టు సాయిలీల ప్రకటించారు.

ఆ రాత్రి ఏం జరిగింది ?

● దోచుకెళ్లిన గ్యాంగ్ ఎక్కడిది..?

● వెంటబడిన వాహనాల కోసం పోలీసుల వేట

● సీసీ ఫుటేజీ, వేలిముద్రల సేకరణ

● హవాలా నగదు దోపిడీ కేసు ఛేదించే పనిలో నిమగ్నం



వాహనం వెనుకభాగంలో నగదు పెట్టేందుకు ఏర్పాటుచేసిన ప్రత్యేక డిక్కీ

హిందూపురం, డిసెంబరు 9 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో సంచలనం రేకెత్తించిన హవాలా నగదు దోపిడీ కేసు ఛేదించే పనిలో పోలీసులు నిమగ్నమయ్యారు. దోపిడీ జరిగిన రోజు రాత్రి ఏం జరిగింది? ఎలా జరిగింది? దోచుకున్నవారు ఎక్కడి నుంచి వచ్చారు? అనే విషయాలపై పోలీసులు లోతుగా దర్యాప్తు ప్రారంభించారు. ఈనెల 3న తెల్లవారుజామున 3-08గంటలకు పెనుకొండ మండలం హరిపురం వైజంక్షన్ వద్ద హవాలా నగదు తరలిస్తున్న వాహనాన్ని ఐదు వాహనాల్లో వచ్చిన గ్యాంగ్ అటకాయించింది. తర్వాత వాహనంలోని రూ.3.10కోట్లు దోచేసింది. అయితే అటుగా వెళ్తున్న ఓ సాఫ్ట్‌వేర్ ఉద్యోగి అక్కడ జరుగుతున్న తతంగంపై పెనుకొండ పోలీసులకు సమాచారం ఇచ్చారు. వెంటనే అప్రమత్తమైన పోలీసులు జాతీయరహదారిపై తనిఖీలు చేపట్టారు. దీంతో పెనుకొండ ఆర్టీఓ కార్యాలయం వద్ద రెండు కార్లు ఆగి ఉండటాన్ని గుర్తించి అటుగా వెళ్లారు. పోలీసు వాహనాలు చూడగానే దుండగులు హవాలా కారును అక్కడే వదిలేసి వేరే కారులో ఉడాయించారు. దీంతో వాహనాన్ని స్టేషన్‌కు తరలించారు. అయితే డబ్బు దోచుకెళ్లిన దుండగులు నగదు తరలిస్తున్న వాహన డ్రైవర్లను కొంతదూరం తీసుకెళ్లి వదిలేశారు. వారు డబ్బున్న వాహనం జీపీఎస్ (మిగతా 6వ పేజీలో..)

నేటి నుంచి 21 వరకు టెట్

● 7 కేంద్రాలు.. 17,100 మంది అభ్యర్థులు

● నిర్వహణకు ఏర్పాట్లు పూర్తి: డీఈఓ 7

ప్రేమ.. పగ..!

చిన్నపాటి వివాదానికి స్నేహితుడి హత్య

ఈత కొడుతుండగా బండరాయితో దాడి

మూడు రోజుల తరువాత వెలుగులోకి..

హతుడు.. నిందితుడు అయ్యప్ప మాలధారులు

బుక్కరాయసముద్రం, డిసెంబరు 9(ఆంధ్రజ్యోతి): నలుగురు స్నేహితులు..! ఒక ప్రేమ కథ..! ఇంకో రూ.180 అప్పు గొడవ..! వెరసి ఆ నలుగురిలో ఒకరి హత్యకు దారితీశాయి. గట్టిగా కొట్టాలని చేసిన ప్రయత్నం నిండు ప్రాణాన్ని బలిగొంది. బుక్కరాయసముద్రంలో సాయి(19) అనే అయ్యప్ప మాలధారు డి హత్య కలకలం రేపింది. వీరభద్ర కాలనీకి చెందిన సాయి, ధనశేఖర్, భార్గవ్, మరో మైనర్(17) స్నేహితులు. సాయి, మైనర్.. అనంతపురం కూరగాయల మార్కెట్‌లో హమాలీలు. ఇద్దరూ ఇటీవల అయ్యప్ప మాల ధరించారు. స్నానం చేసే పేరిట బుక్కరాయసముద్రం సమీపంలోని హెచ్చెల్సీ వద్ద ఉన్న ఓ వ్యవసాయ బావికి సాయిని మైనర్, ధనశేఖర్ శనివారం తీసుకువెళ్లారు. సాయి బావిలో ఈత కొడుతుండగా పథకం ప్రకారం గట్టుపై నుంచి మైనర్ ఓ బరువైన బండరాయిని అతని తలపై వేశాడు. దీంతో తీవ్రంగా గాయపడిన సాయి నీటిలో మునిగిపోయాడు. ఇది చూసిన ధనశేఖర్ భయంతో అక్కడి నుంచి పరారయ్యాడు. మైనర్ తన స్వగ్రామం.. తాడిపత్రి మండలంలోని బుగ్గకు వెళ్లిపోయాడు.



సాయి (ఫైల్)

వాళ్లింట్లో చెబుతా..

పోలీసుల ప్రాథమిక విచారణలో ఆసక్తికర విషయాలు వెలుగులోకి వచ్చాయి. భార్గవ్ అదే కాలనీకి చెందిన ఓ యువతితో ప్రేమలో ఉన్నాడు. ఇటీవల ఆ యువతితో కలిసి బైక్‌పై వెళుతుండగా సాయి చూశాడు. 'ఈ విషయం ఆ అమ్మాయి వాళ్ల ఇంట్లో చెబుతా' అని భార్గవ్‌ను బెదిరించినట్లు సమాచారం. దీంతో సాయిపై కోపం పెంచుకున్న భార్గవ్, మైనర్‌ను కలిశాడు. సాయిని కొడదామని అడిగాడు. సాయితో మైనర్‌కు పాత గొడవలు ఉన్నాయి. 'నా నుంచి రూ.180 తీసుకుని ఇవ్వలేదు. అడిగినందుకు నాపై దాడి చేశాడు. కాబట్టిని సాయిని నేనే కొడతా..' అని భార్గవ్‌కు మైనర్ చెప్పినట్లు తెలుస్తోంది. ఈ క్రమంలోనే ఈతకని నమ్మించి తీసుకువెళ్లి హత్య చేసినట్లు తెలిసింది. బుక్కరాయసముద్రం పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. నిందితులు అందరూ పోలీసుల అదుపులో ఉన్నట్లు సమాచారం. అయ్యప్ప మాలలో ఉన్న స్నేహితుడిని.. మాల ధరించిన మైనర్ హత్య చేయడం ఏమిటని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

పైకి తేలిందా..?

హత్య జరిగిన మూడు రోజుల తరువాత, సోమవారం ధనశేఖర్‌కు మైనర్ ఫోన్ చేశాడు. 'సాయి మృతదేహం పైకి తేలిందా..?' అని ఆరా తీశాడు. ఈ మాటలను అతని పక్కన ఉన్న మరో యువకుడు విన్నాడు. సీపీఐ మండల కార్యదర్శి రామకృష్ణకు ఈ విషయాన్ని వెంటనే తెలియజేశాడు. ఆయన సీఐ పుల్లయ్యకు సమాచారం అందించాడు. పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని, బావిలో ఉన్న సాయి మృతదేహాన్ని వెలికి తీశారు. పోస్టుమార్టం నిమిత్తం అనంతపురం ప్రభుత్వ సర్వజన వైద్యశాలకు తరలించారు.


వైసీపీ కార్యకర్త నకిలీ బాగోతం..!

● పంచాయతీ కార్యదర్శి సంతకం ఫోర్జరీ

● భార్య పేరుతో ప్రభుత్వ స్థలం రిజిస్ట్రేషన్

● పోలీసులకు ఫిర్యాదు చేసిన కార్యదర్శి

బొమ్మనహాళ్, డిసెంబరు 9(ఆంధ్రజ్యోతి): పంచాయతీ కార్యదర్శి సంతకాన్ని ఫోర్జరీ చేసి ప్రభుత్వ స్థలాన్ని అప్పనంగా తన భార్య పేరుతో రిజిస్ట్రేషన్ చేయించుకున్న వైసీపీ కార్యకర్త నకిలీ బాగోతం బయటపడింది. పంచాయతీ కార్యదర్శి సంతకాన్ని ఫోర్జరీ చేసి ఇంటి గుత్త పత్రాలు సృష్టించి, సర్వే నంబర్లను తారుమారు చేశారు. ఉరవకొండలో తప్పుడు డాక్యుమెంట్ తయారు చేసి కణేకల్లు రిజిస్ట్రేషన్ కార్యాలయంలో తన భార్య పేరుతో రిజిస్ట్రేషన్ చేసుకున్నాడు. వైసీపీ కార్యకర్త నకిలీ వ్యవహారంపై పంచాయతీ కార్యదర్శి శివన్న సోమవారం బొమ్మనహాల్ పోలీసులకు ఫిర్యాదు చేయడంతో ఈ వ్యవహారం వెలుగులోకి వచ్చింది. మండలంలోని ఉద్దేహాల్ గ్రామ కంఠంలో ఉన్న 153-3 సర్వే నెంబర్‌లో శిథిలమైన మూడు సెంట్ల ఇల్లు ఉంది. దానికి స్థలం పేరుతో 246 సర్వే నెంబర్‌లో ఉన్న ప్లాట్‌లోని హద్దులతో అగ్రిమెంట్ సృష్టించారు. గ్రామకంఠంపై ఇంటి పట్టా ఉన్నట్లు చూపేందుకు ముందుగా నకిలీ ఇంటి గుత్త పత్రాలు సిద్ధం చేశారు. తన భార్యపై దాన విక్రయం చేసినట్లు రిజిస్ట్రేషన్ చేయించి ప్రభుత్వ లేఅవుట్ స్థలాన్ని ఇతరులకు విక్రయించేందుకు పథకం వేసుకున్నట్లు తెలుస్తోంది.



పంచాయతీ కార్యదర్శి ఫోర్జరీ సంతకంతో సృష్టించిన గుత్త రసీదు

ఉరవకొండలో డాక్యుమెంట్.. కణేకల్లులో రిజిస్ట్రేషన్

ఈ స్థలానికి కీలకమైన పత్రాలను ఉరవకొండలో తయారు చేసి, తక్షణమే కణేకల్లు రిజిస్ట్రేషన్ కార్యాలయంలో రిజిస్ట్రేషన్ చేశారు. ప్రభుత్వ లేఅవుట్‌కు సంబంధించిన హద్దులను గ్రామకంఠ హద్దులుగా మార్చి.. పత్రాలు సిద్ధం చేసి రిజిస్ట్రేషన్ చేయించుకోవడం చకచకా జరిగాయి. నకిలీ గుత్త రసీదుపై తన సంతకం ఫోర్జరీ చేసినట్లు తెలుసుకున్న వెంటనే ఉద్దేహాల్ కార్యదర్శి శివన్న బొమ్మనహాళ్ పోలీసులకు ఫిర్యాదు చేశారు.

నా సంతకం ఫోర్జరీ చేశారు

నా సంతకం ఫోర్జరీ చేశారనే విషయం తెలిసి షాక్‌కు గురయ్యాను. ఆ స్థలం గ్రామకంఠంలో ఉన్నట్లు నా సంతకాన్ని ఫోర్జరీ చేసి గుత్త రసీదు తయారు చేశారు. నేను ఎలాంటి గుత్త రసీదు ఇవ్వలేదు. ధ్రువీకరణలు కూడా చేయలేదు. నా సంతకాన్ని ఫోర్జరీ చేసి గుత్త రసీదు పొంది, డాక్యుమెంట్ తయారు చేయడం నేరం. విషయం తెలిసిన వెంటనే నేను బొమ్మనహాళ్ పోలీసులకు ఫిర్యాదు చేశాను. దర్యాప్తు చేసి నిజానిజాలు వెలికితీయాలని కోరాను.

- శివన్న, పంచాయతీ కార్యదర్శి, ఉద్దేహాళ్ గ్రామం

విచారణ చేస్తున్నాం

తన సంతకాన్ని ఫోర్జరీ చేసి ఇంటి గుత్త రసీదు పొందినట్లు పంచాయతీ కార్యదర్శి శివన్న మాకు ఫిర్యాదు చేశారు. ఆయన ఫిర్యాదు మేరకు విచారిస్తున్నాం. అన్ని రికార్డులను పరిశీలించి కేసు నమోదు చేస్తాం. తప్పుచేసిన వారిపై చట్టపరమైన చర్యలు తప్పవు.

- నబీరసూల్, ఎస్ఐ, బొమ్మనహాళ్

12న వాజ్‌పేయి విగ్రహావిష్కరణ



విలేకరుల సమావేశంలో బీజేపీ నాయకులు

అనంతపురం క్లాక్‌టవర్, డిసెంబరు 9 (ఆంధ్రజ్యోతి): భారత మాజీ ప్రధానమంత్రి అటల్ బిహారీ వాజ్‌పేయి శతజయంతి సందర్భంగా నగరంలోని గుత్తిరోడ్డులో ఈనెల 12న ఆయన విగ్రహాన్ని ఆవిష్కరించనున్నట్లు బీజేపీ నాయకులు తెలిపారు. ఈ కార్యక్రమానికి సంబంధించిన పోస్టర్లను మంగళవారం స్థానిక ఆర్అండ్‌బీ అతిథిగృహంలో వారు విడుదల చేశారు. ఈ సందర్భంగా బీజేపీ జిల్లా అధ్యక్షుడు కొనకొండ్ల రాజేష్, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి దయాకర్ రెడ్డి, రాష్ట్ర కార్యదర్శి సందిరెడ్డి శ్రీనివాసులు, రాష్ట్ర సెల్స్ కన్వీనర్ చిరంజీవిరెడ్డి మాట్లాడారు. నిజాయతీ, పారదర్శకత కలిగిన రాజకీయాలకు వాజ్‌పేయి చిరునామాగా నిలిచారని వారు కొనియాడారు. విగ్రహావిష్కరణ మహోత్సవానికి అధిక సంఖ్యలో కూటమి పార్టీల నాయకులు హాజరు కావాలని కోరారు. కార్యక్రమంలో బీజేపీ సీనియర్ నాయకులు రత్నమయ్య, రామచంద్రయ్య, వసుంధరా దేవి, కిరణ్‌గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

11న మున్సిపల్ చైర్మన్ ఎన్నిక

● ఎన్నికల ప్రిసైడింగ్ అధికారి వసంత్‌బాబు

కళ్యాణదుర్గం, డిసెంబరు 9(ఆంధ్రజ్యోతి): ఈ నెల 11 న కళ్యాణదుర్గం మున్సిపల్ చైర్మన్ ఎన్నిక నిర్వహిస్తున్నామని ఎన్నికల ప్రిసైడింగ్ అధికారి, ఆర్డీఓ వసంత్‌బాబు తెలిపారు. మంగళవారం స్థానిక మున్సిపల్ కార్యాలయంలో మున్సిపల్ కమిషనర్ వంశీకృష్ణ భార్గవ్, డీఎస్పీ రవిబాబుతో కలిసి ఆయన విలేకరుల సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఈ నెల 11న మున్సిపల్ చైర్మన్ ఎన్నిక నిర్వహిస్తున్నామని తెలిపారు. ఈ సందర్భంగా ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు చోటుచేసుకోకుండా 144 సెక్షన్ అమలు చేస్తున్నామని, పకడ్బందీగా బందోబస్తు ఏర్పాటు చేస్తున్నామని వివరించారు. 24 మంది కౌన్సిలర్లు, ఎక్స్ అఫిషియో హోదాలో ఎంపీ, ఎమ్మెల్యేకు మాత్రమే ఓటు హక్కు ఉంటుందన్నారు. ప్రతి ఒక్కరూ గుర్తింపు కార్డుతో హాజరు కావాలని సూచించారు. సెల్‌ఫోన్లకు, ఇతర వ్యక్తులకు ఏ మాత్రం అనుమతి ఉండదని స్పష్టం చేశారు. 400 మీటర్ల వరకు 144 సెక్షన్ అమలులో ఉంటుందన్నారు. పోలీస్ సిబ్బందితో పట్టణమంతా ప్రత్యేక నిఘా ఏర్పాటు చేశామని తెలిపారు. శాంతికి భంగం కలిగించినా, రెచ్చగొట్టే వ్యాఖ్యలు చేసినా చట్టపరమైన చర్యలు తప్పవని హెచ్చరించారు.

ఏమిటీ నిర్లక్ష్యం..?

మీ పిల్లలకు ఇలాగే పెడతారా..?

రాష్ట్ర ఆహార కమిషన్ సభ్యురాలు గంజిమాల దేవి ఆగ్రహం

నాగసముద్రం హెచ్‌ఎంకు షోకాజ్



కాలంచెల్లిన చిక్కీలను పరిశీలిస్తున్న గంజిమాల దేవి



సీకేపల్లి ఉన్నత పాఠశాలలో భోజనాన్ని పరిశీలిస్తూ...

చెన్నేకొత్తపల్లి, డిసెంబరు 9(ఆంధ్రజ్యోతి): 'పిల్లలకు నాణ్యమైన భోజనం అందించడంలో ప్రభుత్వం ఎక్కడా రాజీపడటం లేదు.. ఇక్కడ పూర్తి నిర్లక్ష్యం, అజాగ్రత్త కనిపిస్తున్నాయి.. ఇంట్లో మీ పిల్లలను ఇలాగే చూసుకుంటారా..? వారికి ఏదైనా జరిగితే ఎవరిది బాధ్యత..? నిర్లక్ష్యంతో పిల్లల జీవితాలతో ఆడుకుంటారా..? కాలంచెల్లిన చిక్కీలు పాఠశాలలో ఎందుకు ఉన్నాయి..' అంటూ రాష్ట్ర ఆహార కమిషన్ సభ్యురాలు గంజిమాల దేవి ఆగ్రహం వ్యక్తం చేశారు. నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని నాగసముద్రం ప్రాథమిక పాఠశాల హెచ్‌ఎంకు షోకాజ్ నోటీసు జారీ చేయాలని డీఈవోను ఆదేశించారు. చెన్నేకొత్తపల్లి మండలంలో ఆమె మంగళవారం ఆకస్మికంగా తనిఖీలు చేశారు. నాగసముద్రం ఉన్నత, ప్రాథమిక పాఠశాలలో మధ్యాహ్న భోజన నాణ్యతను పరిశీలించారు. ప్రాథమిక పాఠశాలలో కట్టెల పొయ్యిపై వంట తయారు చేయడం, అరకొర సరుకులు, కాలం చెల్లిన చిక్కీలు కనిపించడంతో ఆమె ప్రధానోపాధ్యాయుడు సాయినాథ్‌రెడ్డిపై ఆగ్రహం వ్యక్తం చేశారు. వాటిని సరఫరా చేసిన కాంట్రాక్టర్‌పైనా ఫోన్‌లో మండిపడ్డారు. హెచ్‌ఎం సాయినాథ్‌రెడ్డికి షోకాజ్ నోటీసు జారీచేయాలని అక్కడే ఉన్న డీఈవో కిష్టప్పను ఆదేశించారు. కాంట్రాక్టర్ లైసెన్స్ రద్దుకు చర్యలు తీసుకుంటామని తెలిపారు. అంతకు ముందు ఉదయం చెన్నేకొత్తపల్లిలో ఆమె విస్తృత తనిఖీలు చేపట్టారు. ఎస్సీ బాలుర హాస్టల్, అంగన్‌వాడీ కేంద్రాలు, పౌరసరఫరాల స్టాక్ పాయింట్, ఉన్నత పాఠశాల, కేజీబీవీ, ప్రభుత్వ చౌక ధాన్యపు డిపోలను తనిఖీ చేశారు. కోడిగుడ్లు చిన్నగా ఉండటంపై అసంతృప్తి వ్యక్తం చేశారు. కేజీబీవీలో తరగతులకు వెళ్లి మెనూ ప్రకారం భోజనం పెడుతున్నారా అని బాలికలను అడిగి తెలుసుకున్నారు. స్టాక్ పాయింట్‌లో బియ్యం బస్తాల తూకాలను పరిశీలించారు. అంగన్‌వాడీ కేంద్రాలలో పౌష్టికాహారం అందిస్తున్న తీరును అడిగితెలుసుకున్నారు. రేషన్‌షాపును సందర్శించి పంపిణీని పరిశీలించారు. స్టాక్ పాయింట్ నుంచి వచ్చే ధాన్యం తూకాలలో తేడాలుంటున్నాయని, ఈ నెల కోటాలో 68 కిలోలు తక్కువ ఉందని డీలర్ ఆమె దృష్టికి తీసుకెళ్లారు. సమస్యపై విచారించి చర్యలు తీసుకుంటామని ఆమె హామీ ఇచ్చారు. తనిఖీల్లో పౌరసరఫరాలశాఖ ఏడీఎం సాయి, ఏఎస్‌ఓ సింధూబాయి, ఐసీడీఎస్ పీడీ ప్రమీల, డీఈఓ క్రిష్ణప్ప, తహసీల్దార్ సురేశ్ కుమార్, ఎంపీడీఓ బాలకృష్ణుడు, ఎంఈఓ ప్రసూన్‌కుమార్‌నాయుడు, సీడీపీఓ కవితాదేవి తదితరులు ఉన్నారు.

మీ ఎమ్మెల్యే బాగా పనిచేస్తున్నారా..?

(5వ పేజీ తరువాయి)

పలువురు సీనియర్ నాయకుల్లో కాస్త అసంతృప్తి వ్యక్తం అవుతోంది. ఐదారేళ్ల కింద పార్టీలోకి వచ్చిన వారికి, జూనియర్లను సైతం డైరెక్టర్, ఇతర పదవులు వరించాయి. దీంతో పోస్టులు వచ్చినవాళ్లు ఆనందంగా ఉంటే...దశాబ్దాల పాటు పార్టీని అంటిపెట్టుకుని ఉన్న సీనియర్లకు పదవులు దక్కపోవడంతో వారితో కొందరిలో అసమ్మతి కనిపిస్తోంది. దీనికితోడు గత ఐదేళ్లు కష్టపడినా తమను గుర్తించడంలేదన్న ఆవేదన కూడా కొందరు తెలుగు తమ్ముళ్ల గళం నుంచి వినిపిస్తోంది. ఇదే విషయాన్ని ఇటీవల కొందరు పార్టీ హైకమాండ్ దృష్టికి తీసుకెళ్లారు. ఇటీవల టీడీపీ జాతీయ ప్రధానకార్యదర్శి, మంత్రి నారా లోకేశ్ కళ్యాణదుర్గం వచ్చినప్పుడు కూడా కొందరు ఆయన దృష్టికి విషయాన్ని తీసుకెళ్లారు. 'మీరు ఇళ్లలో కూర్చొని బాధపడితే మాకు ఎలా తెలుస్తుంది? సమస్య ఏదైనా మా దృష్టికి తీసుకురావాలి' అంటూ లోకేశ్ పార్టీ శ్రేణులకు సూచించారు.

స్థానిక సమరానికి సిద్ధమేనా...?

మరో ఆరు నెలల్లో స్థానిక సంస్థల ఎన్నికలు జరగడం తథ్యమని పార్టీ వర్గాల సమాచారం. ప్రస్తుతం మెజారిటీ స్థానిక సంస్థల్లో వైసీపీ ప్రజాప్రతినిధులే ఉన్నారు. మున్సిపాలిటీలు, పంచాయతీలు, జిల్లాపరిషత్‌లో వైసీపీ నాయకులే ప్రజాప్రతినిధులుగా కొనసాగుతున్నారు. నాటి మున్సిపల్ ఎన్నికల్లో రాష్ట్రంలో తాడిపత్రి మినహా అన్నీ వైసీపీ కైవసం చేసుకుంది. పంచాయతీ ఎన్నికల్లోనూ, జడ్పీటీసీ ఎన్నికల్లో వైసీపీనే మెజార్టీ స్థానాలను కైవసం చేసుకుంది. స్థానిక నేతల పదవీకాలం త్వరలో ముగియనున్న నేపథ్యంలో కొన్ని చోట్ల వైసీపీ నాయకులు దాడులకు దిగుతున్నారు. పంచాయతీల పాలనా గడువు వచ్చే ఏప్రిల్, మున్సిపాలిటీల గడువు మార్చిలో ముగియనుంది. ఇన్నాళ్లు అధికారాన్ని అనుభవించిన వైసీపీ నాయకులు...ఇప్పుడు టీడీపీ నేతల చేతుల్లోకి అధికారం పోతోందన్న అక్కసుతో తెలుగుతమ్ముళ్లపై దాడులకు తెగబడుతున్నారు. దీంతో గ్రామాలు, మండలాలు, మున్సిపాలిటీల్లో రాజకీయ వేడి రాజుకుంటోంది. మరో వైపు కూటమి ప్రభుత్వం త్వరలో స్థానిక ఎన్నికలకు వెళ్లేందుకు సమాయత్తం అవుతోంది. సూపర్ సిక్స్ పథకాల అమలుతో ఎన్నికల హామీ నిలబెట్టుకున్న ప్రభుత్వంపై సర్వత్రా సానుకూలత వ్యక్తం అవుతోంది. తల్లికి వందనం, మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం, ఉచిత గ్యాస్ సిలిండర్లు లబ్ధిదారులకు ప్రభుత్వం పట్ల సానుకూలత పెంచినట్లు స్పష్టం అవుతోంది. ఈనేపథ్యంలోనే గత సార్వత్రిక ఎన్నికల్లో మాదిరే స్థానిక ఎన్నికల్లోనూ విజయం సాధించాలనే ఆలోచనలో అధికారపార్టీ ఉంది. ఎన్నికలకు వెళ్లే నేపథ్యంలోనే టీడీపీ అధిష్ఠానం రాష్ట్రవ్యాప్తంగా ఎమ్మెల్యేల పనితీరుపై ఆరా తీస్తున్నట్లు తెలుస్తోంది.

ఎట్లా పని చేస్తున్నారు?

తెలుగుదేశం పార్టీ హైకమాండ్ తమ పార్టీ ఎమ్మెల్యేల పనితీరు తెలుసుకోడానికి సిద్ధమైంది. 18 నెలలుగా మీ ఎమ్మెల్యే ఎలా పనిచేస్తున్నారంటూ ఐవీఆర్ఎస్ సర్వే చేస్తోంది. రానున్న స్థానిక ఎన్నికల్లో ఎమ్మెల్యేల పాత్ర కీలకం. గెలవాలంటే పార్టీలోని సీనియర్లను, జూనియర్లను, ఇతర కేడర్‌ను సమన్వయం చేసుకోవాలి. ఆ బాధ్యత ఎమ్మెల్యేలు నిర్వహిస్తే గెలుపు సులవవుతుంది. కొన్ని నియోజకవర్గాల్లో గ్రూపు రాజకీయాలు, అధిపత్య పోరు సాగుతోంది. తమను దూరం పెడుతున్నారంటూ.. కొందరు నేతలు ఎమ్మెల్యేలకు దూరంగా ఉంటున్నారు. కొందరు అక్కడే ఆగితే....మరికొందరు ఏకంగా పార్టీ హైకమాండ్ వరకూ వెళ్లి...ఫిర్యాదు చేస్తున్నారు. కొన్ని నియోజకవర్గాల్లో ఎమ్మెల్యేలు అందరినీ కలుపుకుని వెళ్లడం లేదన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి. ఈ క్రమంలో గడిచిన 18 నెలల్లో వాళ్లు ఎలా పని చేశారో...తెలుసుకోడానికి, రానున్న ఎన్నికల కాలానికి పార్టీలోని లీడర్లు, కేడర్ మధ్య ఉన్న అంతరాన్ని తగ్గించడానికి, వారందరినీ ఏకతాటిపై నడిపేందుకు టీడీపీ అధిష్ఠానం సిద్ధమైనట్లు తెలుస్తోంది. ఈ క్రమంలోనే ఎమ్మెల్యేల పనితీరును అంచనా వేసేందుకు సిద్ధమైనట్లు సమాచారం. మంగళవారం ఐవీఆర్ఎస్ ద్వారా శింగనమల, అనంతపురం, కళ్యాణదుర్గం, ఉరవకొండ తదితర నియోజకవర్గాల ఎమ్మెల్యేల పనితీరుపై ప్రజల అభిప్రాయం తెలుసుకున్నారు.

ఆ రాత్రి ఏం జరిగింది?

(5వ పేజీ తరువాయి)

ట్రాకింగ్‌తో పెనుకొండ పోలీస్‌స్టేషన్‌కు చేరుకున్నారు. వారు వచ్చాక అసలు విషయం పోలీసులు తెలుసుకుని అందులో రూ.1.20కోట్లు ఉన్నట్లు గుర్తించారు. దీంతో కేసు నమోదు చేసి దర్యాప్తు వేగవంతం చేశారు.



నగదుతో పట్టుబడిన వాహనం ఇదే

వెంటపడిన వాహనాలు ఎక్కడివి..?

హవాలా నగదు దోపిడీ కేసు నమోదు చేసిన పోలీసులు పలు కోణాల్లో దర్యాప్తు చేస్తున్నారు. దోపిడీకి ముందు ఆరోజు రాత్రి ఏం జరిగింది? డబ్బు తరలిస్తున్న వాహనాన్ని వెంబడించిన వాహనాలు ఎక్కడివి? అవి ఎక్కడి నుంచి వచ్చాయి? ఏ రహదారిలో వచ్చాయనే దానిపై పోలీసులు లోతుగా దర్యాప్తు చేపట్టారు. అసలు ఆరోజు రాత్రి నగదున్న వాహనం ఎక్కడెక్కడ ఆపారు? అక్కడ వాహనాలు ఏవైనా అనుసరించాయా? వెంటాడిన వాహనాలు ఏ రాష్ట్రానికి చెందినవి? ఆ దుండగులు ఎవరనే కోణంలో దర్యాప్తు చేపట్టారు. ఈ నగదు సూరత్ నుంచి బెంగళూరుకు వెళ్తున్నట్లు వాహన డ్రైవర్లు చెప్పారు. ఈ కారులో నగదు ఉన్నట్లు దోపిడీ చేసిన దుండగులకు ఎలా తెలుసు? వారు ఈ వాహనాన్ని ఎలా పసిగట్టారు అనే కోణంలో పోలీసులు విచారణ చేస్తున్నారు. దోపిడీ చేయడానికి ముందుగా ప్లాన్ చేసుకున్నారా? లేక అప్పటికప్పుడే స్కెచ్ వేశారా అనే కోణంలో విచారణ చేపట్టారు. ఈ వాహనాల కోసం పోలీసులు వేటాడుతున్నారు.

దోపిడీ గ్యాంగ్ ఎక్కడిది ?

ఇలాంటి ఘటనలు మన రాష్ట్రంతోపాటు ఇతర రాష్ట్రాల్లో ఎప్పుడైనా జరిగాయా? జరిగి ఉంటే ఎప్పుడు ఎక్కడ జరిగింది ఏ తరహాలో దోపిడీ చేసిందన్న విషయంపై పోలీసులు ఆరా తీస్తున్నారు. ఒక వేళ దోపిడీ ఘటనలు జరిగి ఉంటే ఆ గ్యాంగ్ ఏ రాష్ట్రానికి చెందినదన్న విషయంపై పోలీసులు ప్రత్యేక బృందాన్ని ఏర్పాటు చేసి దర్యాప్తు చేస్తున్నారు. 2022లో ఈ తరహాలోనే రాప్తాడు వద్ద జరిగినట్లు తెలిసింది. అయితే నగదు ఇంతపెద్ద మొత్తంలో తరలిస్తున్నట్లు ఆ గ్యాంగ్‌కు ముందుగానే ఎలా తెలిసి ఉంటుంది? వాహనాన్ని సినిమా ఫక్కీలో అడ్డగించి డ్రైవర్లను కిడ్నాప్‌చేసి నగదును దోచుకెళ్లిన ఘటనను చూస్తే ఇది ముందస్తు ప్రణాళిక ప్రకారమే జరిగినట్లు పోలీసులు అనుమానిస్తున్నారు. అలా ముందుగా స్కెచ్ వేయాలంటే ఆ డబ్బు ఎక్కడి నుంచి తరలిస్తున్నారన్న సమాచారం వారికి ముందుగానే పక్కాగా తెలిసి ఉంటుందని పోలీసులు భావిస్తున్నారు.

ఆధారాల సేకరణలో అధికారులు

ఈ కేసు ఛేదించడానికి పోలీసులు బలమైన ఆధారాల సేకరణలో నిమగ్నమయ్యారు. ఆ రోజు రాత్రి హవాలా నగదు తరలించే వాహన డ్రైవర్లు సూరత్ నుంచి వస్తూ ఎక్కడెక్కడ వాహనాన్ని ఆపారు, ఆపి ఉంటే వారు అక్కడ ఎవరితోనైనా మాట్లాడారా? ముఖ్యంగా ఆంధ్ర, తెలంగాణ, కర్ణాటక బెంగళూరు వరకు ఆరోజు రాత్రి సీసీపుటేజ్‌లు తీసే పనిలో పోలీసులు నిమగ్నమయ్యారు. నగదు తరలించే వాహనంపై పడిన వేలిముద్రలు సేకరిస్తున్నారు. దీనిపై రెండు బృందాలు కర్ణాటక, ఆంధ్ర, తెలంగాణలో గాలిస్తున్నాయి. సంచలనం రేకెత్తించిన ఈ కేసును డీఐజీ, జిల్లా ఎస్పీ సీరియస్‌గా తీసుకుని విచారణ చేస్తున్నారు.

ప్రాణం పోసిన పెద్దాస్పత్రి

- పాముకాటు నుంచి కోలుకున్న శివరామరాజు



శివరామరాజుతో తల్లి లక్ష్మి, డాక్టర్లు

అనంతపురం వైద్యం, డిసెంబరు 9(ఆంధ్రజ్యోతి): పాముకాటుతో ఒక చిన్నారి మృతిచెందగా, మరో చిన్నారికి పెద్దాస్పత్రి వైద్యులు ప్రాణం పోశారు. దీంతో తల్లిదండ్రులు వీరనారాయణస్వామి, లక్ష్మి వైద్యులకు కృతజ్ఞతలు తెలిపారు. 'చిన్న కుమారుడిని కోల్పోయం.. పెద్ద కుమారుడికి పునర్జన్మనిచ్చిన పెద్దాస్పత్రి డాక్టర్లు మా దేవుళ్లు' అని లక్ష్మి అన్నారు. పెద్దవడూరు మండలం కండ్లగూడురుకు చెందిన వీరనారాయణస్వామి, లక్ష్మి దంపతులకు శివనారాయణ(7), శివరామరాజు(10) సంతానం. ఈ నెల 2వ తేదీన నలుగురూ ఇంట్లో నిద్రిస్తుండగా అర్ధరాత్రి ఇద్దరు చిన్నారులను కట్లపాము కాటు వేసింది. ఇద్దరినీ పామిడి ప్రభుత్వ ఆస్పత్రికి తరలించగా, శివనారాయణ మృతి చెందాడు. ప్రాణాప్రాయ స్థితిలో ఉన్న శివరామరాజును అనంతపురం ప్రభుత్వ సర్వజన వైద్యశాలకు తీసుకువచ్చారు. నాలుగురోజుల శివరామరాజు కోమాలో ఉన్నాడు. చిన్నపిల్లల విభాగాధిపతి డాక్టర్ రవికుమార్ పర్యవేక్షణలో వైద్యులు చికిత్స అందించి, ప్రాణాలను నిలబెట్టారు. కోలుకున్న శివరామరాజును సోమవారం డిశ్చార్జి చేశారు. ఈ సందర్భంగా సూపరింటెండెంట్ డాక్టర్ సుబ్రహ్మణ్యం, ఆర్ఎంఓ డాక్టర్ హేమలత, వైద్య బృందానికి లక్ష్మి కృతజ్ఞతలు తెలియజేశారు. బాలుడు అడ్మిషన్ అయిన వెంటనే పాము కాటు లక్షణాలను వైద్యులు గుర్తించారని, విరుగుడుకు తగిన మందులు ఇచ్చారని సూపరింటెండెంట్ తెలిపారు. కృత్రిమంగా శ్వాస అందిస్తూ, నిరంతరం పర్యవేక్షిస్తూ.. వైద్యులు, నర్సింగ్ సిబ్బంది బాలుడి ప్రాణాలను నిలిపారని అభినందించారు. కార్యక్రమంలో చిన్నపిల్లల విభాగం వైద్యులు ప్రవీణ్‌డీన్ కుమార్, భాస్కర్ నాయక్, సంజీవప్ప, మమత, ప్రత్యూష, రాధిక, నర్సింగ్ సూపరింటెండెంట్ నిర్మలాబాయి తదితరులు పాల్గొన్నారు.

12 నుంచి రాష్ట్రస్థాయి యోగాసన పోటీలు

అనంతపురం క్లాక్‌టవర్, డిసెంబరు 9(ఆంధ్రజ్యోతి): 6వ రాష్ట్ర స్థాయి యోగాసన సబ్‌జూనియర్ పోటీలు ఈనెల 12వతేదీ నుంచి జిల్లాకేంద్రంలో నిర్వహించనున్నట్లు యోగాసన స్పోర్ట్స్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు రాజశేఖర్‌రెడ్డి తెలిపారు. ఇందుకు సంబంధించిన కరపత్రాలను మంగళవారం స్థానిక యోగాసన స్పోర్ట్స్ అసోసియేషన్ కార్యాలయంలో విడుదల చేశారు. అనంతరం మాట్లాడుతూ ఈనెల 12వతేదీ నుంచి మూడు రోజుల పాటు యోగాసన సబ్‌జూనియర్ పోటీలు పీవీకేకే కాలేజీలో నిర్వహించనున్నట్లు తెలిపారు. 14 ఏళ్ల వయసులోపు బాల, బాలికలు రాష్ట్ర వ్యాప్తంగా పోటీలకు హాజరవుతారన్నారు. ఏపీ రాష్ట్ర క్రీడాప్రాధికార సంస్థ ఆధ్వర్యంలో పోటీలు ఉంటాయన్నారు. ఇందులోని విజేతలు జనవరి 2వతేదీ నుంచి మహారాష్ట్రలోని నాసిక్‌లో జరిగే జాతీయ స్థాయి సబ్‌జూనియర్ యోగాసన పోటీలకు ప్రాతినిధ్యం వహిస్తారని తెలిపారు. ఆసక్తి, అర్హత గల బాల, బాలికలు సమీపంలోని యోగా కోచ్‌లు, పీడీలను సంప్రదించి తమ పేర్లను నమోదు చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో అసోసియేసన్ గౌరవాధ్యక్షుడు కేవీ రమణ, జిల్లా ప్రధాన కార్యదర్శి మారుతీప్రసాద్ పాల్గొన్నారు.

విద్యుత్ సమస్యలపై సకాలంలో స్పందించండి

- ఎస్ఈ శేషాద్రిశేఖర్ ఆదేశం

అనంతపురం రూరల్, డిసెంబరు 9(ఆంధ్రజ్యోతి): వినియోగదారుల నుంచి వచ్చే విద్యుత్ పరమైన సమస్యలపై సకాలంలో స్పందించాలని విద్యుత్ అధికారులకు, ఉద్యోగులకు ఆ శాఖ ఎస్ఈ శేషాద్రిశేఖర్ ఆదేశించారు. నగరంలోని విద్యుత్ శాఖ ప్రధాన కార్యాలయంలో మంగళవారం ఆయన డయల్ యువర్ ఎస్ఈ కార్యక్రమాన్ని చేపట్టారు. ఈ సందర్భంగా వినియోగదారులు ఫోన్ ద్వారా సమస్యలు తెలిపారు. ముఖ్యంగా లోఓల్టేజీ, విద్యుత్ సరఫరాలో అంతరాయాలు, విద్యుత్ కనెక్షన్ల మార్పుపై విన్నవించారు. జిల్లా వ్యాప్తంగా 14 మంది సమస్యలు తెలిపినట్లు ఎస్ఈ తెలిపారు. సమస్యలను పదిరోజుల్లో పరిష్కరించాలని అధికారులను, సిబ్బందిని ఆదేశించారు. కార్యక్రమంలో టెక్నికల్ ఈఈ ప్రసాద్, కమర్షియల్ డీఈఈ రామకృష్ణ, టెక్నికల్ ఏఈఈ భానుప్రకాశ్, సబ్ ఇంజనీర్లు పాల్గొన్నారు.

ఇన్‌చార్జి కార్యదర్శుల నియామకం

అనంతపురంరూరల్, డిసెంబరు 9(ఆంధ్రజ్యోతి): మండలంలోని పలు పంచాయతీలకు ఇన్‌చార్జి కార్యదర్శులను నియమిస్తూ ఎంపీడీఓ దివాకర్ మంగళవారం ఉత్తర్వులు జారీ చేశారు. అనంతపురం రూరల్, ఉప్పరపల్లి, ఎ.నారాయణపురం, రాచానపల్లి, రుద్రంపేట పంచాయతీల్లో పని చేస్తున్న గ్రేడ్-1 పంచాయతీ కార్యదర్శులు డిప్యూటీ ఎంపీడీఓలుగా ఇటీవల ఉద్యోగోన్నతి పొందారు. ఈక్రమంలోనే రుద్రంపేట తప్పా మిగిలిన పంచాయతీలోని వారందరూ రిలీవ్ అయ్యారు. దీంతో వారి స్థానాల్లో ఎంపీడీఓ ఇన్‌చార్జి కార్యదర్శులను నియమించారు. ఎ.నారాయపురం పంచాయతీ కార్యదర్శిగా మండల డిప్యూటీ ఎంపీడీఓ వెంకటనాయుడుకు ఇది వరకే అదనపు బాధ్యతలు అప్పగించారు. ఇక రాచానపల్లికి కురుగుంట కార్యదర్శి సర్దార్ వలిని, ఉప్పరపల్లికి తాటిచెర్ల కార్యదర్శి నరేంద్రబాబును, అనంతపురం రూరల్ పంచాయితీకి రాజీవ్‌కాలనీ పంచాయతీ కార్యదర్శి రాఘవేంద్రను ఇన్‌చార్జిగా నియమించారు.

ఎప్పుడు ఇస్తారో..?

ఎన్నికల బిల్లులకు మోక్షమేదీ? పెండింగ్‌లో రూ. 6.87కోట్ల బిల్లులు

- ఎమ్మెల్సీ ఎన్నికలవి రూ.3 కోట్లపైబడి
- 18నెలలుగా ఎదురుచూపులు
- ప్రతిపాదనలు పంపినా స్పందన కరువు

అనంతపురం కలెక్టరేట్, డిసెంబరు 9(ఆంధ్రజ్యోతి): సార్వత్రిక ఎన్నికలు పూర్తయి 18నెలలవుతున్నా అందుకు సంబంధించిన బిల్లులు రాకపోవడంతో ఆయా వర్గాలు ఆందోళన వ్యక్తం చేస్తున్నాయి. ప్రతి సార్వత్రిక ఎన్నికల లాగానే ఈ సారి కూడా బిల్లులు పాస్ కావడంలో ఆలస్యమవుతోంది. జిల్లాలో అనంతపురం, శింగనమల, తాడిపత్రి, కళ్యాణదుర్గం, రాయదుర్గం, గుంతకల్లు, రాప్తాడు నియోజకవర్గాలలో ఎన్నికల నిర్వహణకు భారీగా ఖర్చు చేశారు. తొలుత నాలుగు విడతలుగా నిధులు కేటాయించారు. అనంతరం అవసరమై ప్రతిపాదనలు పంపినా రాలేదు. దీంతో ఉద్యోగుల నుంచి వ్యాపార వర్గాల వరకు నిధులు ఖర్చు చేసినా బిల్లులు రాలేదు. బూత్ లెవల్ ఆఫీసర్(బీఎల్ఓ)ల నుంచి ఎన్నికల విధుల్లో పాల్గొన్న ఉద్యోగులకు సైతం రెమ్యునరేషన్ అందకపోవడంతో ఆ వర్గాల్లో అసంతృప్తి నెలకొంది. అధికారులు ప్రతి నెలా బిల్లులు పాస్ చేయాలంటూ చీఫ్ ఎలక్ట్రోరల్ ఆఫీసర్‌కు ప్రతిపాదనలు పంపుతున్నా స్పందన కరువైందని సమాచారం.



రూ.6.87కోట్లు పెండింగ్

జిల్లాకు ఎన్నికల సమయంలో కేటాయించిన నిధుల కంటే అదనంగా కోరిన డబ్బే ఎక్కువగా ఉన్నట్లు సమాచారం. జిల్లా కేంద్రం కావడంతో అనంతపురం నియోజకవర్గానికి నాలుగు విడతలుగా రూ.147, 89000లు నిధులు కేటాయించారు. కానీ మరోసారి 1.23కోట్లు అవసరం ఉందని అధికారులు ప్రతిపాదనలు పంపారు. కానీ ఆ నిధులు రాలేదు. ఎన్నికల సమయంలో రోజుకు పీఓకు రూ.2100లు, ఏపీఓకు రూ.1300లు, ఓపీఓకు రూ.500, బీఎల్ఓలకు రూ.350లు ప్రకారం ఇస్తున్నట్లు చెప్పారు. పోస్టల్ బ్యాలెట్ ప్రక్రియ ఎనిమిది రోజులు కొనసాగింది. పోస్టల్ బ్యాలెట్‌కు పీఓకు రూ.350లు, ఏపీఓకు రూ.350లు, రూ.ఓపీఓలకు రూ.250లు కేటాయించారు. కాగా కొంతవరకే నిధులు ఇచ్చారని, ఇంకా చాలా మంది సిబ్బందికి ఇవ్వలేదనే ఆరోపణలు వచ్చాయి. ఇక షామియానాలు, కుర్చీలు, టిఫిన్లు, భోజనాలు ఇతరత్ర వాటికి లెక్క లేకుండా పోయిందనే విమర్శలున్నాయి. వాహనాలు సమకూర్చినవారు, భోజనాలు అందించిన హోటళ్ల బిల్లులు భారీగా ఉన్నట్లు సమాచారం. వీటిలో కొంతవరకే నిధులు ఖర్చు చేసినా ఇంకా ఇవ్వాల్సిన వారికి పెద్ద మొత్తంలోనే బకాయి ఉన్నట్లు తెలుస్తోంది. ప్రస్తుతం జిల్లాలోని ఎనిమిది నియోజకవర్గాలకు సంబంధించి రూ.6,87,81,582కోట్లు పెండింగ్‌లో ఉన్నట్లు అధికారవర్గాలు తెలిపాయి. ఇందులో మెటీరియల్‌కు సంబంధించి షామియానాలు, కుర్చీలు, ఇతర సామగ్రి, భోజనాల ఖర్చు, వాహనాల వినియోగానికి సంబంధించి మొత్తం రూ. 4.8కోట్ల బిల్లులు అందాల్సి ఉంది. ఉద్యోగుల టీఏ, డీఏలకు సంబంధించిన ఎన్నికల బిల్లు రూ.1.92కోట్లు పెండింగ్ ఉన్నట్లు సమాచారం. ఇక కౌంటింగ్ రోజుకు సంబంధించి మరిన్ని బిల్లులు పెండింగ్‌లో ఉన్నట్లు సమాచారం. బిల్లుల కోసం ఆయా వర్గాల వ్యక్తులు తరచూ కలెక్టరేట్‌కు వస్తుండటంతో 'ప్రతిపాదనలు పంపాం. మా చేతుల్లో ఏం లేదని' అధికారులు చెబుతున్నారు. మరోవైపు 2022లో జరిగిన ఎమ్మెల్సీ ఎన్నికల ఖర్చుకు పెట్టిన బిల్లులు కూడా పెండింగ్‌లోనే ఉన్నాయి. పబ్లికేషన్ చార్జెస్ రూ.2.49కోట్లు, వాహనాల ఖర్చు రూ.90లక్షలు పెండింగ్‌లోనే ఉంది.



కలెక్టరేట్

భారీగా మెక్కేసిన రెవెన్యూ అధికారులు



సార్వత్రిక ఎన్నికలు వస్తే చాలు అప్పనంగా తినేయడానికి కొందరు అధికారులు సిద్ధంగా ఉంటారు. ఎన్నికల సందర్భంలో తహసీల్దార్ల నుంచి ఆర్డీఓల వరకు ఇతర ప్రాంతాల వారిని నియమిస్తారు. వారిలో కొందరూ 2024 ఎన్నికల నిధులను భారీగానే మెక్కేసినట్లు సమాచారం. అనంతపురం నియోజకవర్గానికి అత్యధికంగా రూ.1.47కోట్లు కేటాయించగా, మిగిలిన నియోజకవర్గాలకు రూ.70లక్షల నుంచి రూ.80లక్షల వరకు కేటాయించారు. ఇదే అదనుగా కొందరు రెవెన్యూ అధికారులు ఆ సొమ్మును తమ జేబులోకి మళ్లించుకున్నారు. అనంతపురం నియోజకవర్గంలో ఓ కీలక రెవెన్యూ డివిజన్ స్థాయి అధికారి, మరో తహసీల్దార్ కలిసి దాదాపు రూ.40లక్షల వరకు నిధులు మళ్లించినట్లు సమాచారం. హోల్‌సేల్‌గా మెటిరియల్ తీసుకోవడం, ఖర్చులో ఒక్కో వస్తువుకు ప్రత్యేకంగా చూపించి ఆ ముసుగులో ఎన్నికల సొమ్ము పక్కదారి పట్టించినట్లు తెలిసింది. ఆ క్రమంలో ఎన్నికల విధుల్లో పాల్గొన్న సిబ్బందికి కూడా డబ్బు ఇవ్వలేదనే ఆరోపణలు వినిపించాయి. ఆ తరువాత సంబంధిత అధికారులు మరో జిల్లాకు వెళ్లిపోవడంతో లెక్కలు తేల్చేవారే లేకపోయారు. దీనికి తోడు ఎన్నికల నిధులకు ఆడిట్ లేకపోవడం ఆ అధికారులకు బాగా కలిసొచ్చింది.

ప్రతిపాదనలు పంపాం



రాష్ట్ర వ్యాప్తంగా అన్ని జిల్లాల పరిధిలో ఎన్నికల బిల్లులు పెండింగ్‌లో ఉన్నాయి. జిల్లా పరిధిలో రూ.6కోట్లకు పైగా పెండింగ్ ఉంది. ఈ విషయంపై ఇప్పటికే ప్రతిపాదనలు పంపాం. తాజాగా జరిగిన వీసీలో చీఫ్ ఎలక్ట్రోరల్ ఆఫీసర్ దృష్టికి పెండింగ్ బిల్లుల విషయం తీసుకెళ్లాం. త్వరలోనే బిల్లులు విడుదల అయ్యే అవకాశం ఉంది.

- మలోల, డీఆర్ఓ

మూత దిశగా..!

సమస్యల వలయంలో తపాలా ఆధార్ సెంటర్లు

- 14కిగాను ఆరు మాత్రమే వినియోగంలో...
- మిగిలినవి తాత్కాలికంగా మూత
- టెక్నికల్, సిస్టం, సర్వర్ సమస్యలతోనే..
- కొరవడిన పర్యవేక్షణ
- గ్రామీణ ప్రజలకు తప్పని తిప్పలు



ఆధార్ కేంద్రం వద్ద వేచి ఉన్న కార్డుదారులు

అనంతపురం ప్రెస్‌క్లబ్, డిసెంబరు 9(ఆంధ్రజ్యోతి): తపాలాశాఖ ఆధ్వర్యంలో నడుస్తున్న ఆధార్ సెంటర్లు సమస్యల వలయంలో కొట్టుమిట్టాడుతున్నాయి. జిల్లా వ్యాప్తంగా ఆ శాఖ ఆధార్ సెంటర్లను ప్రవేశపెట్టింది. వాటిని పర్యవేక్షించాల్సిన అధికారులు పట్టించుకోకపోవడంతో అవి మూత దిశగా పయనిస్తున్నాయి. జిల్లావ్యాప్తంగా తపాలాశాఖ ఆధ్వర్యంలో 14 ఆధార్ సెంటర్లు నిర్వహిస్తున్నారు. మొదట్లో అన్నీ సక్రమంగానే పనిచేశాయి. రానురాను పర్యవేక్షణ లోపించడం, సమస్యలను ఎప్పటికప్పుడు పరిష్కరించడంలో కొందరు అధికారుల నిర్లక్ష్యం వెరసి ఆధార్ సెంటర్లు తాత్కాలికంగా మూతవేయాల్సిన దుస్థితి దాపురించింది. జిల్లావ్యాప్తంగా 14 సెంటర్లు ఉండగా... అందులో గుంతకల్లు హెచ్‌ఓ, అనంతపురం హెచ్‌ఓ, జూర్జిపేట ఎస్‌ఓ, యాడికి ఎస్‌ఓ, నార్పల ఎస్‌ఓ, తిమ్మనచర్ల ఎస్‌ఓల్లో మాత్రమే ఆధార్ సెంటర్లు వినియోగంలో ఉన్నాయి. గుత్తి, కళ్యాణదుర్గం, రాయదుర్గం, పామిడి, కణేకల్లు, తాడిపత్రి, ఉరవకొండ, ఎస్‌వీపురంలో తపాలా ఆధార్ సెంటర్లు తాత్కాలికంగా మూతవేశారు. వీటిలో ప్రధానంగా కళ్యాణదుర్గం, రాయదుర్గం, కణేకల్లు, ఉరవకొండ ప్రాంతాల్లో గిరిజన ప్రజలు ఎక్కువగా ఉండటంతో అక్కడ సెంటర్లు ఏర్పాటు చేశారు. అవి పనిచేయకపోవడంతో గిరిజన ప్రాంత ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు.

అన్నీ సమస్యలే..

తపాలా శాఖ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ఆధార్ సెంటర్లకు నిత్యం ఏదో ఒక సమస్య పట్టి పీడిస్తోందనే చెప్పాలి. సర్వర్ సమస్య గురించి చెప్పక్కర్లేదు. ఏ సెంటర్‌లో చూసినా ఈ సమస్య సర్వసాధారణం అయిందనే చెప్పాలి. మిగిలిన చోట్ల టెక్నికల్, సిస్టం సమస్యలతో సెంటర్లు దాదాపు మూతదశకు చేరుకున్నాయి. వీటిని ఎప్పటికప్పుడు పర్యవేక్షించాల్సిన ఆయా హెచ్‌ఓ, ఎస్‌ఓల్లో అధికారులు వాటి గురించి పట్టించుకోకపోవడంతో సమస్య తలెత్తుతోందనే చెప్పాలి. సమస్యను ఎప్పటికప్పుడు ఉన్నతాధికారులు తెలియజేయాల్సిన ఆయా పోస్టాఫీసుల్లోని సిబ్బంది చేరవేయకపోవడమే ఆధార్ సెంటర్లు మూతపడటానికి ప్రధాన కారణమనడంలో సందేహం లేదు.

అన్ని కేంద్రాలను వినియోగంలోకి తెస్తాం



జిల్లాలో తపాలాశాఖ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ఆధార్ సెంటర్లలో కొన్ని పనిచేయని విషయం వాస్తవమే. ఇప్పటికే ఎక్కడెక్కడ పనిచేయడం లేదో.. ఆయా సెంటర్ల వివరాలను సేకరించాం. వాటికి సంబంధించి ఇప్పటికే టెక్నీషియన్లతో సమస్యను సరిదిద్దే ప్రయత్నం చేస్తున్నాం. డిసెంబరు నాటికి జిల్లాలోని అన్ని తపాలా శాఖల్లోని ఆధార్ సెంటర్లను వినియోగంలోకి తెస్తాం... ప్రజలకు అసౌకర్యం కలగకుండా సేవలు అందిస్తాం. - అమర్‌నాథ్, సూపరింటెండెంట్

క్రైం కార్నర్

కళ్లెదుటే వృద్ధురాలు సజీవ దహనం

● షార్ట్ సర్క్యూట్‌తో పూరిగుడిసెకు మంటలు

● నిద్రిస్తున్న సమయంలో ప్రమాదం



గంగమ్మ (ఫైల్)

బెళుగుప్ప, డిసెంబరు 9(ఆంధ్రజ్యోతి): కన్నతల్లి కళ్లెదుటే మంటల్లో సజీవ దహనం అవుతుంటే.. కాపాడు కోలేక దీనస్థితిలో కొడుకు, ఏమీ చేయలేని నిస్సహాయ స్థితిలో భర్త తల్లడిల్లిపోయారు. మండలంలోని గంగవరంలో సోమవారం రాత్రి షార్ట్ సర్క్యూట్‌తో పూరి గుడిసె దగ్ధమయింది. గ్రామ స్థులు తెలిపిన వివరాల మేరకు.. గ్రామ స మీపంలో వ్యవసాయ తోటలో రెండు పూరిగుడిసెలు నిర్మించుకుని నరసన్న, గంగమ్మ కుటుంబ సభ్యులతో కలిసి నివాసముంటున్నారు. ఒక గుడిసెలో గంగమ్మ(60) నిద్రిస్తుండగా షార్ట్ సర్క్యూట్‌తో దగ్ధమైంది. అనారోగ్యంతో బాధపడుతూ కళ్లు సరిగా కనిపించకపోవడంతో మంటల నుంచి బయటకు రాలేక చిక్కుకుని గుడిసెలో కాలి మృతి చెందింది. ఎద్దులబండి టైర్లు ఉండటంతో మంటలకు కాలి పెద్ద శబ్దమొచ్చింది. శబ్దం విని బయటికి రాగానే పెద్దఎత్తున మంటల్లో గుడిసె దగ్ధమవుతుండగా భర్త నరసన్న, కుమారుడు యర్రిస్వామి బయటి నుంచి చూస్తూ అరవడం మినహా ఏమీ చేయలేకపోయారు.

వ్యక్తి దారుణ హత్య

● వివాహేతర సంబంధమే కారణం



హత్యకు గురైన చలపతి (ఫైల్)



నిందితుడు వెంకటరమణ

నల్లచెరువు, డిసెంబరు 9 (ఆంధ్రజ్యోతి): మండలంలోని కుమ్మరవాండ్లపల్లికి చెందిన చలపతి (37) మంగళవారం హత్యకు గురయ్యాడు. పోలీసులు తెలిపిన మేరకు కుమ్మరవాండ్లపల్లికి చెందిన చలపతి భవన నిర్మాణ పనులు చేసుకుంటూ తన భార్య, ఇద్దరు పిల్లలను పోషించుకునేవాడు. ఈయన గత 8 ఏళ్లుగా పక్క గ్రామానికి చెందిన వెంకటరమణ భార్యతో వివాహేతర సంబంధం కలిగి ఉన్నాడు. ఈ విషయంపై వెంకటరమణ ఎన్నోసార్లు తన భార్యకు బుద్ధి చెప్పాలని చూశాడు. అయినా ఆమె మాట వినకుండా గొడవ పడి మూడేళ్ల కిందట అయన్నగారి కొత్తపల్లిలోని పుట్టింటికి వెళ్లిపోయింది. అయినా చలపతి ఆమెతో వివాహేతర సంబంధం కొనసాగించాడు. దీన్ని అవమానంగా భావించిన వెంకటరమణ ఎలాగైనా చలపతిని అంతమొందించాలనుకున్నాడు. ఈక్రమంలో ఓరువాయి గ్రామంలోని ఎల్లమ్మ గుడి సమీపంలో చలపతి భవన నిర్మాణ పనులు చేస్తున్నాడని వెంకటరమణ తెలుసుకున్నాడు. ఉదయం 9 గంటల సమయంలో పని విరామ సమయంలో భోజనం చేస్తుండగా వెనుక నుంచి వెళ్లి మెడపై కొడవలితో నరికాడు. దీంతో చలపతి అక్కడికక్కడే మృతి చెందాడు. భవన నిర్మాణ పనులు చేస్తున్న కూలీలు పోలీసులకు సమాచారం ఇవ్వడంతో సీఐ నాగేంద్ర, ఎస్పై మక్బుల్ బాషాలు ఘటన స్థలాన్ని పరిశీలించి కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

నకిలీ నోట్ల ముఠా అరెస్టు



దొంగ నోట్ల ముఠాను అరెస్టు చూపుతున్న పోలీసులు

బత్తలపల్లి, డిసెంబరు 9(ఆంధ్రజ్యోతి): నకిలీ నోట్లను చలామణి చేసే ముఠాను అరెస్టు చేసినట్టు సీఐ ప్రభాకర్ తెలిపారు. స్థానిక పోలీస్‌స్టేషన్‌లో మంగళవారం ఎస్ఐ సోమశేఖర్‌తో కలిసి ఆయన విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా సీఐ మాట్లాడుతూ.. నకిలీనోట్లను విక్రయిస్తున్న కడప జిల్లా తాళ్లప్రొద్దుటూరుకు చెందిన బోడేపల్లి అంజి, ఓబులేసు, తాడిపత్రి మండలం బోడాయిపల్లికి చెందిన రాజకుళ్లాయప్పను అరెస్టు చేసి కోర్టులో హాజరు పరిచినట్లు తెలిపారు. వివరాల్లోకి వెళితే.. బోడేపల్లి అంజి, అతడి మిత్రుడు చామలూరు ఓబులేసుకు నకిలీ నోట్ల గురించి చెప్పాడు. రూ.లక్ష నగదు ఇస్తే.. మూడు లక్షల విలువైన నకిలీ నోట్లు ఇస్తారని తెలిపాడు. ఓబులేసు రాజకుళ్లాయప్ప ద్వారా కమలాపురం గ్రామానికి చెందిన వీరాంజనేయరెడ్డితో మాట్లాడుకున్నారు. ఆ మేరకు గత నెల 18న మండలంలోని సంజీవపురం ఆర్చ్ వద్ద నకిలీ నోట్లను వీరాంజనేయరెడ్డికి చూపించారు. నమ్మితించిన వీరాంజనేయరెడ్డి 19న మరోసారి సంజీవపురం వద్దకు వచ్చాడు. ముదిగుబ్బ మండలం ఉప్పలపాడు గ్రామానికి చెందిన బాలు, హరి ద్వారా అసలైన నోట్లు రూ.3లక్షలు ఇచ్చి.. నకిలీ నోట్లు రూ.9లక్షలు తీసుకొని వెళ్లిపోయారు. వారు ఇచ్చిన నకిలీ నోట్లు సరైనవి కావని గుర్తించిన వీరాంజనేయరెడ్డి అంజి, ఓబులేసుతో డబ్బు విషయమై మాట్లాడాలని వెంకటగారిపల్లి క్రాస్ వద్దకు రమ్మన్నారు. దొంగ నోట్ల ముఠా సోమవారం రాత్రి గొడవ పడుతుండగా పోలీసులకు సమాచారం అందింది. ఎస్ఐ సిబ్బందితో అక్కడికి చేరుకున్నారు. దొంగనోట్ల ముఠా సభ్యులను అదుపులోకి తీసుకున్నారు. ఈ మేరకు కేసు నమోదు చేసి కోర్టుకు హాజరుపరిచినట్లు సీఐ తెలిపారు.

20 మంది జూదరుల అరెస్టు

గుంతకల్లు టౌన్, డిసెంబరు 9(ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని వెంకటాంపల్లి గ్రామ శివారులో పేకాట స్థావరంపై మంగళవారం సాయంత్రం రూరల్ పోలీసులు, అనంతపురం స్పెషల్ పార్టీ పోలీసులు దాడులు నిర్వహించారు. పేకాడుతున్న 20 మందిని అరెస్టు చేశారు. వారి నుంచి రూ.18,92,040 నగదు, ఒక కారు, 24 సెల్ ఫోన్లు, 17 బైక్‌లను స్వాధీనం చేసుకున్నారు. దాడుల్లో రూరల్ సీఐ ప్రవీణ్ కుమార్, ఎస్ఐ రాఘవేంద్రప్ప తదితరులు పాల్గొన్నారు.

మాజీ ఎంపీపీకి జరిమానా

గుత్తి, డిసెంబరు 9(ఆంధ్రజ్యోతి): టీడీపీకి చెందిన మాజీ ఎంపీపీ ద్విచక్ర వాహనానికి పోలీసులు జరిమానా విధించారు. గుత్తి పట్టణంలోని ఎన్టీఆర్ సర్కిల్‌లో సీఐ రామారావు ఆధ్వర్యంలో సోమవారం సాయంత్రం వాహనాలను తనిఖీ చేశారు. ఈనేపథ్యంలో టీడీపీ మాజీ ఎంపీపీ వీరభద్రయ్య తన ద్విచక్రవాహనంపై వెళ్తుండగా బైక్‌ను నిలిపారు. సెల్‌ఫోన్‌లో మాట్లాడుతూ, హెల్మెట్ లేకుండా వెళ్తుండడంతో రూ.1050 జరిమానా విధించారు. జరిమానా చెల్లించి వాహనాన్ని తీసుకెళ్లాలని సిబ్బందికి సూచించారు. తాను ఆన్‌లైన్‌లో చెల్లిస్తానని ఆయన తెలిపాడు. వాహనాన్ని అక్కడే వదిలి ఆటోలో వెళ్లిపోయాడు. దీంతో పోలీసులు ద్విచక్రవాహనాన్ని స్టేషన్‌కు తరలించారు. ఈ విషయంపై సీఐను వివరణ కోరగా.. తాము నిబంధనల మేరకు జరిమానా విధించామని తెలిపారు.

టమోటా కిలో రూ.27



అనంతపురం రూరల్, డిసెంబరు 9(ఆంధ్రజ్యోతి): కక్కలపల్లి టమోటా మార్కెట్లో మంగళవారం టమోటాలు కిలో గరిష్ఠంగా రూ.27తో అమ్ముడుపోయినట్లు రాప్తాడు మార్కెట్ యార్డు కార్యదర్శి రూప్‌కుమార్ తెలిపారు. అదేవిధంగా కనిష్ఠంగా రూ.14తో, సరసరిగా రూ.20తో విక్రయాలు జరిగాయన్నారు. మార్కెట్‌కు 1575 టన్నుల టమోటాలు వచ్చినట్లు చెప్పారు.

చీనీ టన్ను రూ.19వేలు



అనంతపురం రూరల్, డిసెంబరు 9(ఆంధ్రజ్యోతి): అనంత వ్యవసాయ మార్కెట్లో మంగళవారం సీజనల్ చీనీకాయలు టన్ను గరిష్ఠంగా రూ.19వేలతో అమ్ముడుపోయినట్లు మార్కెట్ ఎంపిక శ్రేణికార్యదర్శి, మార్కెటింగ్ శాఖ ఏడీ రాఘవేంద్రకుమార్ తెలిపారు. అలాగే కనిష్ఠంగా రూ.10వేలు, సరాసరి ధర రూ.14వేలు పలికాయన్నారు. మార్కెట్‌కు మొత్తంగా 42టన్నుల చీనీకాయలు వచ్చినట్లు పేర్కొన్నారు.

చౌకబారు రంగయ్యా.. నీ ఆటలు సాగవ్..!

● కళ్యాణదుర్గం ఎమ్మెల్యే అమిలినేని సురేంద్రబాబు

● టీడీపీ తీర్థం పుచ్చుకున్న మున్సిపల్ వైస్ చైర్మన్

● రంగయ్య తీరుతోనే టీడీపీలో చేరా

:జయం ఫణీంద్ర



మాట్లాడుతున్న ఎమ్మెల్యే అమిలినేని సురేంద్రబాబు

అనంతపురం క్రైం, డిసెంబరు 9(ఆంధ్రజ్యోతి): వైసీపీ నాయకుడు తలారి రంగయ్య చౌకబారు ఆరోపణలు చేస్తున్నారని, బురద చల్లి గొప్పవాడు కావాలని చూస్తున్నాడని, ఆయన ఆటలు ఇక సాగవని కళ్యాణదుర్గం ఎమ్మెల్యే అమిలినేని సురేంద్రబాబు చురకలంటించారు. రాజకీయ ఉనికి కోసమే ఆయన తనపై ఆరోపణలు చేస్తున్నారని మండిపడ్డారు. సోమవారం అనంతపురంలోని తన నివాసంలో కళ్యాణదుర్గం ఎమ్మెల్యే అమిలినేని సురేంద్రబాబు మీడియా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఆనంద్ మృతి బాధాకరం అన్నారు. అగ్రవర్ణాలు చంపాయంటూ రంగయ్య ఆరోపణలు చేయడం సరికాదని అన్నారు. ఆధారాలు ఉంటే చూపాలని నిలదీశారు. పోలీసులు ఇచ్చిన నోటీసులు తీసుకోకుండా తిరుగుతున్నారని అన్నారు. బురద చల్లితే గొప్పవాడివి కాలేవని హితవు పలికారు. న్యాయం తెలుగుదేశం వైపే ఉంటుందని, ప్రజలకు మంచి చేయాలనే రాజకీయాల్లోకి వచ్చానని తెలిపారు. రంగయ్య వద్ద ఏవైనా ఆధారాలు ఉంటే.. రుజువు చేయాలని సవాల్ విసిరారు. ఆయన రాజకీయ చేష్టలు చూసి విసుగెత్తే... కళ్యాణదుర్గం మున్సిపల్ వైస్ చైర్మన్ జయం ఫ ణీంద్ర టీడీపీలో చేరారని తెలిపారు. మున్సిపల్ వైస్ చైర్మన్ జయం ఫణీంద్ర మాట్లాడుతూ.. మాజీ ఎంపీ రంగయ్య వైఖరి వల్లే తాను వైసీపీ వీడినట్టు తెలిపారు. ఎమ్మెల్యే చేస్తున్న అభివృద్ధి చూసి, సహకరించాలని టీడీపీ తీర్థం పుచ్చుకున్నట్టు ఆయన వివరించారు.



టీడీపీలో చేరుతున్న కళ్యాణదుర్గం వైస్ చైర్మన్

వైసీపీకి భారీ షాక్

● పార్టీకి మున్సిపల్ వైస్ చైర్మన్ రాజీనామా.. టీడీపీలో చేరిక

● టీడీపీ వశంకానున్న కళ్యాణదుర్గం మున్సిపల్ పీఠం

కళ్యాణదుర్గం, డిసెంబరు 9(ఆంధ్రజ్యోతి): వైసీపీకి భారీ షాక్ తగిలింది. కళ్యాణదుర్గం మున్సిపల్ చైర్మన్ పీఠం టీడీపీ కైవసం కాబోతోంది. మున్సిపల్ వైస్ చైర్మన్ జయం ఫణీంద్ర అనూహ్యంగా వైసీపీని వీడి టీడీపీలో చేరనున్నట్లు ప్రకటించారు. దీంతో టీడీపీకి సం ఖ్యాబలం పెరిగింది. జయం ఫణీంద్ర వైసీపీకి రాజీనా మా చేసి ఎమ్మెల్యే అమిలినేని సురేంద్రబాబు ఆధ్వర్యం లో మంగళవారం టీడీపీలో చేరారు. ఈ నెల 11న మున్సిపల్ చైర్మన్ ఎన్నికను నిర్వహిస్తున్నారు. కళ్యాణదుర్గం మున్సిపాలిటీలో మొత్తం 24 మంది కౌన్సిలర్లు ఉన్నారు. వీరిలో 13 మంది వైసీపీ వర్గీయులు, 11 మంది టీడీపీ వర్గీయులు ఉన్నారు. ఎక్స్ అఫిషియో హోదాలో ఎ మ్మెల్యే, ఎంపీకి ఓటు వేసే హక్కు ఉంది. దీంతో పాటు తాజాగా వైసీపీ మున్సిపల్ వైస్ చైర్మన్ జయం ఫణీంద్ర టీడీపీలోకి చేరారు. దీంతో టీడీపీ సంఖ్యా బలం 14 కు చేరింది. ఇక గెలుపు తథ్యం కాబోతోందన టీడీపీ వర్గీయులు ధీమాతో ఉన్నారు.

ఇంటర్ విద్యార్థిని ప్రసవం

అనంతపురం వైద్యం, కళ్యాణదుర్గం, డిసెంబరు 9(ఆంధ్రజ్యోతి): తాడిపత్రి ప్రాంతానికి చెందిన ఇంటర్ విద్యార్థిని కళ్యాణదుర్గంలో ప్రసవించింది. ఈ విషయం ఐసీడీఎస్ అధికారులకు తెలియడంతో చైల్డ్‌లైన్‌కు వివరాలను తెలియజేశారు. ఓ జూనియర్ కళాశాలలో చదువుతున్న బాలిక, అదే ప్రాంతానికి చెందిన బాలుడి కారణంగా గర్భం దాల్చింది. ఈ విషయం కుటుంబ సభ్యులకు తెలియడంతో వారు కళ్యాణదుర్గం ప్రాంతంలోని తమ బంధువుల ఇంటికి బాలికను పంపారు. బాలికను, శిశువును, కుటుంబ సభ్యులను అధికారులు సఖి కేంద్రానికి తరలించి కౌన్సెలింగ్ ఇచ్చారు. కేసు నమోదు చేయాలని తాడిపత్రి పోలీసులకు సిఫార్సు చేశారు.

సైబర్ నేరగాళ్ల బారిన ప్రైవేట్ ఉద్యోగి

● రూ.80వేలు మాయం

సోమందేపల్లి, డిసెంబరు 9(ఆంధ్రజ్యోతి): మండలంలోని బ్రాహ్మణపల్లికి చెందిన ప్రైవేట్ ఉద్యోగికి మొబైల్‌లోని వాట్సప్‌కు మెసేజ్ వచ్చింది. మెసేజ్‌ను చదివిన అతను గుర్తుతెలియని వ్యక్తులతో చాటింగ్ చేశాడు. అనంతరం వారు పంపిన లింక్‌ను క్లిక్ చేయడంతో తన ఖాతా నుంచి రూ.80వేలు మాయమైనట్లు గ్రహించాడు. డబ్బులు కట్అయినట్లు మెసేజ్ రావడంతో ఉలిక్కిపడ్డాడు. బ్యాంక్ మినీ స్టేట్‌మెంట్ చెక్‌చేయగా సైబర్ నేరగాళ్లు నగదును తమ ఖాతాలోకి బదిలీ చేసుకున్నట్లు గ్రహించి లబోదిబోమన్నాడు. తనకు జరిగిన అన్యాయాన్ని పోలీసులకు తెలుపగా పుట్టపర్తిలోని సైబర్ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదుచేయాలని తెలిపారు. విషయం తెలిస్తే పరువు పోతుందని భావించి వివరాలు వెల్లడించలేదని వాపోయాడు.

డిగ్రీలో ఇద్దరు డీబార్

అనంతపురం ప్రెస్‌క్లబ్, డిసెంబరు 9(ఆంధ్రజ్యోతి): ఎస్కేయూ పరిధిలో జరుగుతున్న డిగ్రీ 3, 5వ సెమిస్టర్‌లో పరీక్షల్లో ఇద్దరిని డీబార్ చేసినట్లు పరీక్షల విభాగం డైరెక్టర్ ఆచార్య జీవీ రమణ తెలిపారు. ఈ మేరకు మంగళవారం ఆయన ఓ ప్రకటన విడుదల చేశారు. గుత్తిలోని ఎంఎస్ డిగ్రీ కళాశాలలో ఒకరు, హిందూపురంలోని బాలాజీ విద్యామందిర్‌లో ఒకరు కాపీయింగ్‌కు పాల్పడుతున్నట్లు గుర్తించి డీబార్ చేసినట్లు ఆయన తెలిపారు.

22 నుంచి పీజీ సెమిస్టర్ పరీక్షలు

అనంతపురం ప్రెస్‌క్లబ్, డిసెంబరు 9(ఆంధ్రజ్యోతి): ఎస్కేయూ పరిధిలోని పీజీ 3వ సెమిస్టర్ పరీక్షలు ఈ నెల 22 నుంచి ప్రారంభమవుతున్నట్లు పరీక్షల విభాగం డైరెక్టర్ ఆచార్య జీవీ రమణ తెలిపారు. ఈ మేరకు మంగళవారం ఆయన ఓ ప్రకటన విడుదల చేశారు. ఎస్కేయూతో పాటు అనుబంధ కళాశాలలైన నగరంలోని శ్రీవాణి, పీవీకేకే, హిందూపురంలోని కళాశాలలో పరీక్షలు జరుగుతాయన్నారు.

బి.ఫార్మసీ ఫలితాలు విడుదల

అనంతపురం ప్రెస్‌క్లబ్, డిసెంబరు 9(ఆంధ్రజ్యోతి): జేఎన్‌టీయూ(ఏ) పరిధిలో నవంబరులో నిర్వహించిన బి.ఫార్మసీ ఫలితాలను విడుదల చేసినట్లు పరీక్షల విభాగం డైరెక్టర్ ఆచార్య నాగప్రసాద్ నాయుడు తెలిపారు. ఈ మేరకు మంగళవారం పరీక్షల విభాగంలో వీసీ ఆచార్య సుదర్శనరావు, రిజిస్ట్రార్ కృష్ణయ్య ఆదేశాల మేరకు బి.ఫార్మసీ నాల్గవ సంవత్సరం ఒకటవ సెమిస్టర్(ఆర్19) రెగ్యులర్, సప్లిమెంటరీ, నాల్గవ సంవత్సరం ఒకటో సెమిస్టర్(ఆర్15) సప్లమెంటరీ, నాల్గో సంవత్సరం రెండో సెమిస్టర్(ఆర్19), (ఆర్15) సప్లిమెంటరీ పరీక్షా ఫలితాలను విడుదల చేశామని పేర్కొన్నారు. పరీక్షా ఫలితాల కోసం వెబ్‌సైట్‌ను సందర్శించాలన్నారు. కార్యక్రమంలో పరీక్షల విభాగం కంట్రోలర్ ఏపీ శివకుమార్, అడిషనల్ కంట్రోలర్స్ శంకర్‌శేఖర్ రాజు. శ్రీధర్, అంకారావు పాల్గొన్నారు.

నేడు న్యాయశాస్త్ర విభాగంలో సదస్సు

అనంతపురం ప్రెస్‌క్లబ్, డిసెంబరు 9(ఆంధ్రజ్యోతి): ఎస్కేయూలోని న్యాయశాస్త్ర విభాగంలో 'రాజ్యాంగాన్ని అర్థం చేసుకుందాం - కాపాడుకుందాం' అనే అంశంపై సదస్సు నిర్వహిస్తున్నట్లు జేవీవీ నాయకులు మంగళవారం ఓ ప్రకటనలో తెలిపారు. ఉదయం 10.30 గంటలకు నిర్వహించే సదస్సుకు మాజీ ఎమ్మెల్సీ గేయానంద్, మానవ హక్కుల వేదిక నాయకుడు చంద్రశేఖర్ ముఖ్య అతిథులుగా హాజరై ప్రసంగిస్తారని పేర్కొన్నారు.

శిశుగృహలో ఉద్యోగావకాశాలు

అనంతపురం వైద్యం, డిసెంబరు 9(ఆంధ్రజ్యోతి): మహిళా శిశు సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న శిశుగృహలో ఉద్యోగాలకు దరఖాస్తులు స్వీకరిస్తున్నట్లు ఐసీడీఎస్ పీడీ అరుణకుమార్ తెలిపారు. శిశుమరణంతో ఇటీవల శిశుగృహలోని సిబ్బందిని తొలగించామని, కలెక్టర్ ఆనంద్ ఆదేశాల మేరకు ఖాళీ పోస్టులను కాంట్రాక్ట్, పార్ట్‌టైం ప్రాతిపదికన భర్తీ చేస్తున్నామని తెలిపారు. ఆసక్తిగల అభ్యర్థులు ఈ నెల 14వరకు దరఖాస్తులు సమర్పించవచ్చని తెలిపారు. ఈ నెల 13, 14వ తేదీలు సెలవు రోజులైనా దరఖాస్తులను తీసుకుంటామని తెలిపారు. ఐసీడీఎస్ కార్యాలయంలో ఉదయం 10.30 గంటల నుంచి సాయంత్రం 5గంటల వరకు దరఖాస్తులను ఇవ్వవచ్చునని తెలిపారు.

రెండోరోజూ అంతే..!

● పీజీ స్పాట్ అడ్మిషన్లకు 20 మంది హాజరు

● నేడూ అడ్మిషన్లు

అనంతపురం ప్రెస్‌క్లబ్, డిసెంబరు 9(ఆంధ్రజ్యోతి): ఎస్కేయూలో నిర్వహిస్తున్న పీజీ మిగులు సీట్ల స్పాట్ అడ్మిషన్లకు రెండోరోజు స్పందన కరువయింది. మంగళవారం ఉదయం 10 గంటలకు అడ్మిషన్ల ప్రక్రియ ప్రారంభించారు. సాయంత్రంలో ముగిసేలోపు 20 మంది మాత్రమే అడ్మిషన్లు పొందారు. రెండ్రోజుల పాటు జరిగిన అడ్మిషన్ల ప్రక్రియలో 29 విభాగాలలో ఖాళీగా ఉన్న 808 సీట్లకు మొత్తం 128 మంది అడ్మిషన్లు పొందినట్లు అధికారులు తెలిపారు. వీరిలో ఎంత మంది ఫీజులు చెల్లించారన్న దానిపై స్పష్టత కొరవడింది. ఈ నేపథ్యంలోనే అడ్మిషన్ పొందిన విద్యార్థుల సంఖ్యను అధికారికంగా అధికారులు నిర్ధారించలేకపోతున్నట్లు తెలుస్తోంది. దీనిపై అడ్మిషన్ల విభాగం డైరెక్టర్ నరసింహన్‌ను వివరణ కోరగా... ఎంత మంది కట్టారన్నది ఇప్పుడే చెప్పలేమని, ప్రక్రియ ముగిసిన తరువాత ప్రకటిస్తామని చెప్పుకొచ్చారు. అడ్మిషన్ల ప్రక్రియ బుధవారం కూడా కొనసాగనున్నట్లు ఆయన తెలిపారు.

రేపటి నుంచి ఆహార కమిషన్ సభ్యురాలి పర్యటన

అనంతపురం కలెక్టరేట్, డిసెంబరు 9(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ఆహార కమిషన్ సభ్యురాలు గంజిమాల దేవి జిల్లాలో ఈ నెల 11, 12 తేదీల్లో పర్యటించనున్నారని కలెక్టర్ ఆనంద్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. జాతీయ ఆహార భద్రతా చట్టం - 2013 అమలును పర్యవేక్షించడం, సమీక్షించడం కోసం ఏపీ రాష్ట్ర ఆహార కమిషన్‌ను ప్రభుత్వం ఏర్పాటు చేసిందన్నారు. జిల్లాలో జాతీయ ఆహార భద్రతా చట్టం అమలులో భాగంగా పీడీఎస్, ఎండీఎం, ఐసీడీఎస్, పీఎంఎంవీవై, ఇతర సంక్షేమ పథకాల అమలును తనిఖీ చేయడానికి, క్షేత్ర పర్యటన కోసం ఆమె జిల్లాలో పర్యటించనున్నట్లు కలెక్టర్ తెలిపారు.

నరసింహస్వామి హుండీ ఆదాయం రూ.21.64 లక్షలు



ఆలయంలో హుండీ ఆదాయం లెక్కిస్తున్న అధికారులు

మడకశిర రూరల్, డిసెంబరు 9 (ఆంధ్రజ్యోతి): భక్తరహళ్లి నరసింహస్వామి, జిల్లేడగుంట ఆంజనేయస్వామి హుండీలను మంగళవారం లెక్కించినట్లు ఈఓ నరసింహరాజు తెలిపారు. రెండు దేవాలయాల నుంచి రూ.21.64 లక్షలు హుండీ ఆదాయం వచ్చినట్లు తెలిపారు. అందులో భక్తరహళ్లి నరసంహస్వా మి హుండీ ఆదాయం రూ.13.60 లక్షలు, జిల్లేడగుంట ఆంజనేయస్వామి హుండీ ఆదాయం రూ.8.32 లక్షలు వచ్చినట్లు తెలిపారు.

నేటి నుంచి 21 వరకు టెట్

● 7 కేంద్రాలు.. 17,100 మంది అభ్యర్థులు

● నిర్వహణకు ఏర్పాట్లు పూర్తి: డీఈఓ

అనంతపురం విద్య, డిసెంబరు 9(ఆంధ్రజ్యోతి): డీఎస్సీ రాసే అభ్యర్థులతో పాటు ఈసారి ఇన్‌సర్వీస్ టీచర్లకు టెట్ పరీక్ష నిర్వహిస్తున్నారు. బుధవారం నుంచి టెట్ పరీక్షలు మొదలవుతున్నాయి. ఇందుకు సంబంధించిన వివరాలను మంగళవారం డీఈఓ ప్రసాద్‌బాబు వెల్లడించారు. టెట్ పరీక్షలు బుధవారం ప్రారంభమై.. ఈనెల 21వరకు కొనసాగుతాయ తెలిపారు. జిల్లాలో టెట్ నిర్వహణకు అవసరమైన ఏర్పాట్లు పూర్తి చేశామని అన్నారు. జిల్లా వ్యాప్తంగా ఏడు కేంద్రాల్లో పరీక్షలు నిర్వహిస్తామని వివరించారు. ఇందులో అనంతలక్ష్మి ఇంజినీరింగ్ కాలేజ్, ఎస్‌వీఐటీ ఇంజినీరింగ్ కాలేజ్, ఎస్ఆర్ఐటీ ఇంజినీరింగ్ కాలేజ్, తాడిపత్రి సీవీరామన్ ఇంజినీరింగ్ కాలేజ్, తాడిపత్రి ఇంజినీరింగ్ కాలేజ్, గుత్తి గేట్స్ కాలేజ్‌తో పాటు అనంతపురం చిన్మయనగర్‌లోని నేషనల్ కౌన్సిల్ ట్రైనింగ్ సెంటర్‌లో పరీక్షలు ఏర్పాటు చేశామని అన్నారు. జిల్లాలో 17,100 మంది అభ్యర్థులు హాజరవుతున్నారని తెలిపారు. ప్రతిరోజూ ఉదయం, మధ్యాహ్నం పరీక్షలు కొనసాగుతాయని వెల్లడించారు.



దరఖాస్తులను పరిశీలిస్తున్న కమిటీ సభ్యులు

80 పోస్టులు.. 584 దరఖాస్తులు

● అకడమిక్ ఇన్‌స్ట్రక్టర్లకు భారీ పోటీ ● ఎంపిక ప్రక్రియలో జాప్యం

అనంతపురం విద్య, డిసెంబరు 9(ఆంధ్రజ్యోతి): వేతనం తక్కువే అయినా, అకడమిక్ ఇన్‌స్ట్రక్టర్ పోస్టులకు భారీగా దరఖాస్తులు వచ్చాయి. సబ్జెక్టు టీచర్‌లు లేని ప్రభుత్వ పాఠశాలల్లో ప్రత్యామ్నాయంగా అకడమిక్ ఇన్‌స్ట్రక్టర్లను (వలంటీర్లు) నియమించుకోవాలని విద్యాశాఖ కమిషనర్ ఆదేశించిన విషయం తెలిసిందే. జిల్లాలో 80 ఖాళీలు ఉండగా, 584 దరఖాస్తులు వచ్చాయి. స్కూల్ అసిస్టెంట్ కేడర్ పోస్టులు 60, ఎస్‌జీటీ క్యాడర్‌లో 20 ఖాళీలు ఉన్నాయి. ఎస్‌జీటీలకు రూ.10 వేలు, స్కూల్ అసిస్టెంట్‌కు రూ.12500 వేతనం ఇస్తారు. సమగ్ర శిక్ష ద్వారా ఈ విద్యా సంవత్సరానికి వేతనం ఇస్తామని ఉత్తర్వులలో పేర్కొన్నారు. ఈ నెల 5వ తేదీ వరకు ఎంఈఓలకు అభ్యర్థులు దరఖాస్తులను అందజేశారు. ఎంపిక ప్రక్రియను 8వ తేదీకల్లా పూర్తి చేయాలని ఆదేశాలు ఉన్నా, భారీగా దరఖాస్తులు రావడంతో ఇంకా పూర్తి కాలేదు.

ఎస్‌జీటీలకు భారీ పోటీ: జిల్లాలో 80 పోస్టులకు 584 దరఖాస్తులు అందాయని డీఈఓ ప్రసాద్‌బాబు తెలిపారు. స్కూల్ అసిస్టెంట్ విభాగంలో 9 బయాలజీ పోస్టులకు 45 మంది, 4 ఇంగ్లిష్ పోస్టులకు 26 మంది, 19 హిందీ పోస్టులకు 49 మంది, 2 ఫిజికల్ సైన్స్ పోస్టులకు ఇద్దరు, 6 గణితం పోస్టులకు 38 మంది, 3 సోసియల్ పోస్టులకు 43 మంది, 9 తెలుగు పోస్టులకు 39 మంది, 5 సోషియల్ ఉర్దూ పోస్టులకు 14 మంది దరఖాస్తు చేశారు. ఎస్‌జీటీ పోస్టులు 20 ఉండగా, ఏకంగా 316 మంది అభ్యర్థులు దరఖాస్తు చేశారు. దరఖాస్తుల పరిశీలనకు కొంత మంది ఉన్నత పాఠశాలల హెచ్‌ఎంలతో కమిటీ వేశారు. కమిటీ సభ్యులు మంగళవారం డీఈఓ కార్యాలయంలో దరఖాస్తులను పరిశీలించి, మెరిట్ పాయింట్స్ కేటాయించారు. ఉన్నతాధికారులు పరిశీలించిన తర్వాత నిబంధనల మేరకు అభ్యర్థులను ఎంపిక చేసి, జాబితాను కలెక్టరుకు పంపుతామని డీఈఓ తెలిపారు. కలెక్టర్ ఆమోదం పడిన తర్వాత అభ్యర్థులకు సమాచారం పంపుతామని అన్నారు.

రాయల జయంతి ఉత్సవాలు నిర్వహించాలి : మంత్రి



టూరిజం శాఖ అధికారులతో మాట్లాడుతున్న మంత్రి సవిత

పెనుకొండ టౌన్, డిసెంబరు 9(ఆంధ్రజ్యోతి): శ్రీకృష్ణదేవరాయల జయంతి ఉత్సవాలను నిర్వహించేందుకు ప్రణాళికలు సిద్ధం చేయాలని పర్యాటకశాఖ అధికారులకు మంత్రి సవిత సూచించారు. స్థానిక క్యాంపు కార్యాలయంలో మంగళవారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ.. పెనుకొండ, పుట్టపర్తి ప్రాంతాల్లో పర్యాటక రంగాన్ని అభివృద్ధి చేయాలని తెలిపారు. గొల్లపల్లి రిజర్వాయర్‌లో బోటింగ్, టూరిజం గెస్ట్‌హౌస్ నిర్మాణాలపై దృష్టిసారించాలన్నారు. పెనుకొండ కొండకు రోడ్డు పూర్తికావడంతో పర్యాటకుల సంఖ్య పెరుగుతోందని అన్నారు. ఈ క్రమంలో కొండపై కూడా గెస్ట్‌హౌస్ నిర్మించాలని పేర్కొన్నారు. కుంభకర్ణ ప్రాజెక్టును అభివృద్ధి చేయాలని తెలిపారు.

నేడు డిప్యూటీ సీఎంతో మాటామంతీ

● జిల్లా నుంచి వెళ్లిన అధికారులు

అనంతపురం న్యూటౌన్, డిసెంబరు 9 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలోని పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి ఉద్యోగులతో డిప్యూటీ సీఎం, పంచాయతీరాజ్ శాఖ మంత్రి పవన్ కల్యాణ్ బుధవారం భేటీ కానున్నారు. అందుకు సంబంధించి మంగళగిరిలోని సీకే కన్వెన్షన్ హాలు వేదిక కానుంది. ఈ మేరకు జిల్లా నుంచి పంచాయతీ కార్యదర్శులు, డిప్యూటీ ఎంపీడీఓలు, ఏఓలు, ఎంపీడీఓలు, నూతనంగా పదోన్నతి పొందిన వారి జాబితా తయారు చేయించి మాటా - మంతీ కార్యక్రమంలో హాజరయ్యేలా జిల్లా పరిషత్ ఇన్‌చార్జ్ సీఈవో వెంకటసుబ్బయ్య చర్యలు చేపట్టారు. ఈమేరకు ఆర్టీసీ నుంచి రెండు బస్సులు ఏర్పాటు చేసి సిబ్బంది వెళ్లడానికి ఏర్పాట్లు చేశారు. మంగళవారం డీపీఓ నాగరాజనాయుడుతో పాటు 22 మంది తరలి వెళ్లారు.

చిత్తూరు డీఈఓగా బుక్కపట్నం డైట్ లెక్చరర్



రాజేంద్రప్రసాద్

కొత్తచెరువు, డిసెంబరు 9(ఆంధ్రజ్యోతి): బుక్కపట్నం డైట్ కళాశాల సీనియర్ లెక్చరర్ కె.రాజేంద్రప్రసాద్ చిత్తూరు డీఈఓగా నియమితులయ్యారు. ఈ మేరకు రాష్ట్ర విద్యాశాఖ ముఖ్య కార్యదర్శి కోన శశిధర్ మంగళవారం ఉత్తర్వులు జారీ చేశారు. రాష్ట్ర వ్యాప్తంగా పలువురు సీనియర్ అధ్యాపకులు, ఉద్యోగులకు విద్యాశాఖ ఉద్యోగోన్నతులను కల్పించింది. అందులో భాగంగా రాజేంద్రప్రసాద్‌ను ఉద్యోగోన్నతిపై చిత్తూరు జిల్లా విద్యాశాఖ అధికారిగా నియమించారు.

గైబువల్లికి సలహాదారు పదవి



అనంతపురం అర్బన్, డిసెంబరు 9 (ఆంధ్రజ్యోతి): కేంద్ర సహకార మంత్రిత్వ శాఖకు హిందీ సలహాదారుడిగా హిందీసేవాసదన్ వ్యవస్థాపకుడు, హైదరాబాద్ హిందీ ప్రచార సభ ప్రధాన కార్యదర్శి ఎస్. గైబువల్లి నియమితులయ్యారు. ఈ మేరకు కేంద్ర ప్రభుత్వం గెజిట్ విడుదల చేసింది. ఈ సందర్భంగా మంగళవారం స్థానిక హిందీసేవా సదన్ కార్యాలయంలో గైబువల్లి మీడియాతో మాట్లాడారు. తన 18వ ఏట నుంచే హిందీ భాషా ప్రచారంలో విశేష కృషి చేస్తున్నట్లు తెలిపారు. హిందీ భాషాభివృద్ధికి తెలుగు రాష్ట్రాల్లో అనేక కార్యక్రమాలు నిర్వహించినట్లు తెలిపారు. తన సేవలను గుర్తించి పదవి ఇచ్చిన కేంద్ర ప్రభుత్వానికి ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. హిందీ భాషాభివృద్ధికి మరింత ఉత్సాహంతో పని చేస్తానన్నారు. కేంద్ర సహకార మంత్రిత్వ శాఖకు హిందీ సలహాదారుడిగా నియమితులైన గైబువల్లికి పలువురు హిందీ పండితులు శుభాకాంక్షలు తెలిపారు.

అక్రమ నిర్మాణాలను సహించేది లేదు

- ఏఎంసీ కమిషనర్ బాలస్వామి
- హౌసింగ్‌బోర్డులో అనధికార నిర్మాణాల కూల్చివేత



హౌసింగ్‌బోర్డు మెయిన్‌రోడ్డులో అక్రమ నిర్మాణాన్ని తొలగింపజేస్తున్న ఏఎంసీ టౌన్‌ప్లానింగ్ అధికారులు

అనంతపురం క్లాక్‌టవర్, డిసెంబరు 9 (ఆంధ్రజ్యోతి): అనుమతి లేకుండా అక్రమంగా నిర్మాణాలు చేపడితే సహించేది లేదని... అనధికార నిర్మాణాలను తొలగిస్తామని... కనుక వెంటనే క్రమబద్ధీకరించుకోవాలని అనంత నగరపాలక సంస్థ కమిషనర్ బాలస్వామి హెచ్చరించారు. కమిషనర్ ఆదేశాల మేరకు మంగళవారం స్థానిక హౌసింగ్‌బోర్డు మెయిన్ రోడ్డులో అక్రమంగా చేపట్టిన నిర్మాణాలను టౌన్‌ప్లానింగ్ ఏసీపీ సీర జాక్షి, టీపీఎస్ అంజలి ఆధ్వర్యంలో సిబ్బంది ఎక్సకవేటర్‌తో తొలగింపజేశారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ ఇప్పటికే నగరంలోని రహమత్‌నగర్, కమలానగర్, పాతూరు ప్రాంతాల్లో అనుమతులు లేకుండా అక్రమంగా చేపట్టిన నిర్మాణాలను తొలగించామని తెలిపారు. ఎటువంటి అనుమతులు లేకుండా, నిబంధనలకు విరుద్ధంగా... 2025 ఆగస్టు 31వతేదీ తరువాత నిర్మాణ దశలో ఉన్న భవనాలను రాష్ట్ర ప్రభుత్వం జారీ చేసిన బిల్డింగ్ పీనలైజేషన్ స్కీం ద్వారా క్రమబద్ధీకరించుకోవాలన్నారు. ఆ స్కీం కింద అక్రమ నిర్మాణాలను క్రమబద్ధీకరణ చేసుకున్నవారికి వెసులుబాటు కల్పిస్తామన్నామని తెలిపారు. ఒది ఒక సారి మాత్రమే ఇచ్చిన అవకాశమన్నారు. నిర్ణీత గడువులోగా అన్ని డాక్యుమెంట్లతో ఆన్‌లైన్‌లో నమోదు చేసుకుని, నిర్ణయించిన జరిమానా చెల్లించి, చట్టబద్ధం చేసుకోవాలని సూచించారు. లేని పక్షంలో చట్టపరమైన చర్యల్లో భాగంగా ఆయా భవనాలను గుర్తించి తొలగించి, సంబంధిత భవన యజమానులపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. సందేహాలు, అనుమానాల నివృత్తికి ఏఎంసీలోని టౌన్ ప్లానింగ్ విభాగంలో సంప్రదించాలని కోరారు.

సీఎంఆర్‌ఎఫ్ చెక్కుల పంపిణీ



చెక్కులు పొందిన లబ్ధిదారులతో ఎమ్మెల్యే పరిటాల సునీత

రామగిరి, డిసెంబరు 9(ఆంధ్రజ్యోతి): రాప్తాడు నియోజకవర్గంలోని చెన్నేకొత్తపల్లి, రామగిరి, కనగానపల్లి మండలాలకు చెందిన 19 మందికి సీఎం రిలీఫ్ ఫండ్ కింద రూ.11.23లక్షలు మంజూరయ్యాయి. అందుకు సంబంధించిన చెక్కులను ఎమ్మెల్యే పరిటాల సునీత మండలంలోని వెంకటాపురంలో గల తన నివాసంలో మంగళవారం లబ్ధిదారులకు పంపిణీ చేశారు. అనంతరం మాట్లాడుతూ వైద్యం అందక ఏ ఒక్కరు ఇబ్బందులు పడకూడదనేది ప్రభుత్వ లక్ష్యమనిన్నారు. ఎన్టీఆర్ వైద్యసేవ వర్తించని వారికి సీఎంఆర్ఎఫ్ ద్వారా ఆదుకుంటోందని తెలిపారు. చెక్కులు అందుకున్న వారు సీఎం చంద్రబాబుకు, ఎమ్మెల్యే పరిటాల సునీతకు కృతజ్ఞతలు తెలిపారు.

నేడు తూంచెర్లలో ఎమ్మెల్యే పర్యటన

కనగానపల్లి: మండలంలోని తూంచెర్ల గ్రామంలో బుధవారం ఎమ్మెల్యే పరిటాల పర్యటిస్తారని టీడీపీ మండల కన్వీనర్ యాతం పోతలయ్య మంగళవారం ప్రకటనలో తెలిపారు. గ్రామంలో జరుగుతున్న తారు రోడ్డు పనులు, పలు అభివృద్ధి కార్యక్రమాలను పరిశీలించనున్నట్లు చెప్పారు.

బాస్కెట్ బాల్ పోటీల్లో పీవీకేకే విద్యార్థి ప్రతిభ



ఉమర్‌ను అభినందిస్తున్న ప్రిన్సిపాల్ తదితరులు

అనంతపురం రూరల్, డిసెంబరు 9 (ఆంధ్రజ్యోతి): పీవీకేకే ఎంసీఏ ప్రథమ సంవత్సరం విద్యార్థి ఉమర్ బాస్కెట్ బాల్ పోటీల్లో ప్రతిభ చూపినట్లు ఎంపిక్లైనట్లు కళాశాల ప్రిన్సిపాల్ బండి రమేష్ బాబు తెలిపారు. దీంతో మంగళవారం కళాశాల చైర్మన్ పల్లె కిషోర్ రెడ్డి, ఏఓ మనోహర్‌రెడ్డి, పీడీ ధనుంజయతో పాటు ప్రిన్సిపాల్ ఆ విద్యార్థిని అభినందించారు. ఈసందర్భంగా ప్రిన్సిపాల్ మాట్లాడుతూ.. ఈనెల 3వ తేదీన నంద్యాలలోని ఆర్‌జీఎం ఇంజనీరింగ్ కళాశాలలో సౌత్ జోన్ బాస్కెట్ బాల్ టోర్నమెంట్ సెలెక్షన్లు జరిగాయని, అందులో ఉమర్ అద్భుతమైన ప్రతిభ చూపి దక్షిణ మండల జట్టుకు ఎంపికయ్యాడని అన్నారు. ఈనెల 24వ తేదీన తమిళనాడులోని ఎస్‌ఆర్ఎం యూనివర్సిటీలో జరిగే నేషనల్ లెవల్ బాస్కెట్‌బాల్ చాంపియన్‌షిప్‌లో పాల్గొనే అర్హతను పొందినట్లు పేర్కొన్నారు.

వరి ధాన్యాన్ని ప్రభుత్వమే కొనుగోలు చేయాలి

శింగనమల, డిసెంబరు 9(ఆంధ్రజ్యోతి): రైతులు పండించిన వరి ధాన్యాన్ని ప్రభుత్వమే కొనుగోలు చేయాలని వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి తరిమెల భాస్కర్ డిమాండ్ చేశారు. మండలంలో తరిమెల, కల్లుమడి గ్రామాల్లో వరి పొలాలను మంగళవారం ఆయన పరిశీలించారు. అనంతరం మాట్లాడుతూ వరిధాన్యాన్ని గిట్టుబాటు ధరతో ప్రభుత్వమే కొనుగోలు చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో నాయకులు సుంకన్న, ఎర్రిస్వామి, మునెప్ప, కొండారెడ్డి, కేశన్న పాల్గొన్నారు.

సీపీఐ శతాబ్ది వేడుకలను విజయవంతం చేయండి



సమావేశంలో మాట్లాడుతున్న సీపీఐ జిల్లా సహాయ కార్యదర్శి మల్లికార్జున

అనంతపురం రూరల్, డిసెంబరు 9(ఆంధ్రజ్యోతి): సీపీఐ శతాబ్ది వేడుకలను విజయవంతం చేయాలని ఆ పార్టీ జిల్లా సహాయ కార్యదర్శి మల్లికార్జున పిలుపునిచ్చారు. నగరంలోని పార్టీ కార్యాలయంలో మంగళవారం నాయకుడు సి. రాజు అధ్యక్షతన మండల సమావేశం జరిగింది. ముఖ్య అతిథులుగా జిల్లా సహాయ కార్యదర్శి మల్లికార్జున, కార్యదర్శి వర్గ సభ్యుడు రామకృష్ణ పాల్గొన్నారు. మల్లికార్జున మాట్లాడారు. ఈనెల 11వతేదీన స్థానిక లలిత కళాపరిషత్‌లో సీపీఐ శతాబ్ది వేడుకలను ఘనంగా నిర్వహించనున్నట్లు తెలిపారు. పార్టీ జాతీయ ప్రధాన కార్యదర్శి డి.రాజా, కార్యదర్శి రామకృష్ణ, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఈశ్వరయ్య, కార్యదర్శి వర్గ సభ్యుడు జగదీష్ హాజరవుతారన్నారు. పార్టీ కోసం ప్రాణాలర్పించిన యోధుల కుటుంబాలకు సన్మానం చేయనున్నట్లు చెప్పారు. పార్టీ శ్రేణులు పెద్ద ఎత్తున పాల్గొనాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో రాప్తాడు నియోజకవర్గ కార్యదర్శి రమేష్, చేతివృత్తిదారుల రాష్ట్ర నాయకుడు పోతులయ్య, గిరిజన సమైక్య రాష్ట్రనాయకుడు రామాంజనేయులు, మండల కార్యదర్శి నరేష్, సహాయ కార్యదర్శి దుర్గాప్రసాద్, నాయకులు రాకెట్ల రాము, శ్రీకాంత్ తదితరులు పాల్గొన్నారు.

టీచర్లపై ఒత్తిడి సరికాదు: పీఆర్‌టీయూ

అనంతపురం విద్య, డిసెంబరు 9(ఆంధ్రజ్యోతి): పదోతరగతి పరీక్షల ప్రణాళిక పేరుతో టీచర్లను మానసికంగా ఒత్తిడికి గురిచేయడం సరికాదని పీఆర్‌టీయూ నాయకులు ఆవేదన వ్యక్తం చేశారు. ఆ సంఘం జిల్లా అధ్యక్షుడు విష్ణువర్ధన్‌రెడ్డి, జిల్లా ప్రధానకార్యదర్శి చంద్రశేఖరరెడ్డి తదితరులు డీఈఓ ప్రసాద్‌బాబును జిల్లాకేంద్రంలో మంగళవారం కలిసి మాట్లాడారు. ఉత్తమ ఫలితాల పేరుతో పాఠశాలలో అమలు చేస్తున్న వందరోజుల ప్రణాళిక వల్ల ఇటు విద్యార్థులు అటు టీచర్లు తీవ్ర ఒత్తిడికి గురవుతున్నారన్నారు. కనీసం ఆదివారం కూడా సెలవు ఇవ్వకుండా నిరంతరం ప్రణాళిక అమలు చేయడం వల్ల ఈసమస్య ఏర్పడుతోందన్నారు. ఈప్రణాళిక ముసుగులో చాలామంది హెచ్‌ఎంలు టీచర్లపై పెత్తనం చెలాయిస్తూ మరింత ఇబ్బందికి గురి చేస్తున్నారన్నారు. సెలవులు ఇవ్వకుండా ఇబ్బందులకు గురిచేయడం సరికాదని, ఇలాగే వ్యవహరిస్తే అన్నిసంఘాలతో కలిసి నిరసనలు చేయాల్సి వస్తుందని హెచ్చరించారు. అనంతరం టీచర్లపై ఒత్తిడి తగ్గించాలని వినతి పత్రం అందజేశారు.

విద్యార్థి సంఘాల ఆందోళన



అంబేడ్కర్ విగ్రహం వద్ద ఆందోళన చేస్తున్న విద్యార్థి సంఘాల నాయకులు

అనంతపురం విద్య, డిసెంబరు9 (ఆంధ్రజ్యోతి): పాఠశాలల్లోకి ఎవరూ వెళ్లకూడదంటూ కమిషనర్ జీఓ ఇవ్వడం దుర్మార్గమని విద్యార్థి సంఘాల నాయకులు మండిపడ్డారు. ఈ జీఓను నిరసిస్తూ మంగళవారం వారు నగరంలోని అంబేడ్కర్ విగ్రహం వద్ద ఆందోళన చేపట్టారు. వెంటనే ఆ నిబంధనల జీఓను రద్దుచేయాలని నినాదాలు చేశారు. పలువురు నాయకులు మాట్లాడుతూ విద్యార్థి సంఘాలు పాఠశాలల్లోకి వెళ్లేది రాజకీయాల కోసం కాదని, విద్యార్థుల సమస్యలు తెలుసుకొని వాటి పరిష్కారంకోసం పోరాడేందుకని తెలిపారు. అలాంటి విద్యార్థి సంఘాలను పాఠశాలలలోకి వెళ్లరాదని నిబంధనలు పెట్టడం ఎంతవరకు సమంజమని ప్రశ్నించారు. వెంటనే ఈవ్యతిరేక జీఓను ఉపసంహరించుకోవాలన్నారు. లేదంటే పెద్దఎత్తున ఆందోళనలు చేపడతామని హెచ్చరించారు. ఏఐఎస్ఎఫ్, ఎస్ఎఫ్ఐ, పీడీఎస్‌యూ, బీసీ, ఎస్సీ, మైనార్టీ, వీఎస్‌వీ, పీఎస్ఎఫ్, ఏఐఎస్బీ, ఏఐఎస్ఓ విద్యార్థి సంఘాల నాయకులు పాల్గొన్నారు.

యువకుడి ఆత్మహత్య



మృతి చెందిన శివ

కనగానపల్లి, డిసెంబరు 9(ఆంధ్రజ్యోతి): మండలంలోని తల్లిమడుగుల గ్రామంలో ఓ యువకుడు ఆత్మహత్యకు పాల్పడ్డాడు. పోలీసులు తెలిపిన మేరకు వివరాలిలా ఉన్నాయి. తల్లిమడుగుల గ్రామానికి చెందిన యువకుడు శివ (27) కూలి పనులు చేస్తూ కుటుంబాన్ని పోషిస్తున్నాడు. అయితే మంగళవారం సాయంత్రం ఇంట్లో ఎవరూ లేని సమయంలో ఫ్యాన్‌కు ఉరి వేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. వెంటనే కుటుంబసభ్యులు గమనించి అతన్ని ధర్మవరం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. వైద్యులు పరీక్షించి అప్పటికే మృతిచెందినట్లు తెలిపారు. మృతుడికి భార్య లక్ష్మీతో పాటు ఇద్దరు కుమార్తెలు ఉన్నారు. ఆత్మహత్యకు గల కారణాలు పోలీసుల విచారణలో తెలియాల్సి ఉంది.

రైతులకు అందుబాటులో ఎరువులు

అనంతపురంరూరల్, డిసెంబరు 9(ఆంధ్రజ్యోతి): మండలంలోని రైతు సేవా కేంద్రాల్లో రైతులకు అవసరమైన ఎరువులు అందుబాటులో ఉన్నాయని ఏఓ వెంకట కుమార్ తెలిపారు. మండలంలోని తాటిచెర్ల, సోములదొడ్డి గ్రామాల్లో మంగళవారం ఆయన పొలం పిలుస్తుంది కార్యక్రమాన్ని నిర్వహించారు. రైతు సేవా కేంద్రాల్లో రైతులతో సమావేశమై మాట్లాడారు. యూరియా, డీఏపీ ఎరువులు ప్రతి రైతు సేవా కేంద్రంలో అందుబాటులో ఉన్నాయని తెలిపారు. కావాల్సిన రైతులు వినియోగించుకోవాలని సూచించారు. తొలుత గ్రామాల్లో పలు పంట పొలాలను పరిశీలించి సస్యరక్షణ చర్యలను రైతులకు తెలియజేశారు. వ్యవసాయ విస్తరణ అధికారులు మల్లికార్జున, మురళీకృష్ణ, వీఆర్వో మంజునాథ్, ఆర్ఎస్‌కే సిబ్బంది పాల్గొన్నారు.

జేఎన్‌టీయూ వీసీని కలిసిన ప్రొఫెసర్లు



వీసీ సుదర్శనరావుతో ప్రొఫెసర్లు

అనంతపురం ప్రెస్‌క్లబ్, డిసెంబరు 9 (ఆంధ్రజ్యోతి): జేఎన్‌టీయూ వీసీ సుదర్శనరావును గతంలో జేఎన్‌టీయూలోని పనిచేసిని ప్రొఫెసర్ ఆచార్య లంక అనంతరామశర్మ కలిశారు. మంగళవారం జిల్లాకొచ్చిన ఆయన జేఎన్‌టీయూలోని చాంబర్‌లో వీసీని మర్యాదపూర్వకంగా కలిశారు. ఉమ్మడి జేఎన్‌టీయూ హైదరాబాద్ క్వార్టర్స్‌లో గడిపిన క్షణాలను వారు గుర్తుచేసుకున్నారు. వీసీని కలిసిన వారిలో ప్రొఫెసర్లు ఆచార్య సుజాత, ఆచార్య దుర్గాప్రసాద్, ఆచార్య సుజాత, ఆచార్య శోభాబిందు, మాజీ ఆచార్య శంకర్ తదితరులు ఉన్నారు.

స్పాట్ అడ్మిషన్లు నిర్వహించాలని వినతి

అనంతపురం ప్రెస్‌క్లబ్, డిసెంబరు9(ఆంధ్రజ్యోతి) : ఎస్కేయూ పరిధిలోని బీఈడీ, లా కోర్సులకు స్పాట్ అడ్మిషన్లు నిర్వహించాలని ఎస్ఎఫ్ఐ యూనివర్సిటీ అధ్యక్షుడు పవన్, కార్యదర్శి శాంతిరాజు కోరారు. ఈ మేరకు మంగళవారం వీసీ అనిత, రిజిస్ట్రార్ రమేష్‌బాబును చాంబర్‌లో కలిసి వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ... బీఈడీ, లా కోర్సుల అడ్మిషన్లకు ఎంతో మంది అర్హులైన విద్యార్థులు వేచి ఉన్నారన్నారు. తక్షణమే స్పాట్ అడ్మిషన్లు నిర్వహించి సీట్లను భర్తీ చేయాలన్నారు. కార్యక్రమంలో నాయకులు సాయి, ప్రేమ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

స్నేహితుడి కుటుంబానికి ఆర్థికసాయం



మృతుడి కుటుంబసభ్యులకు నగదును అందిస్తున్న దృశ్యం

కనగానపల్లి, డిసెంబరు 9(ఆంధ్రజ్యోతి): మండలంలోని తూంచెర్ల గ్రామంలో బాబావలి అనే వ్యక్తి అనారోగ్యంతో ఇటీవల మృతిచెందాడు. దీంతో ఆయన కుటుంబానికి స్నేహితులు నరసప్ప, చిన్న అక్కులప్ప, నాగార్జున యాదవ్, ముత్యాలు తదితరులు బుధవారం రూ.17వేలు ఆర్థిక సాయం చేశారు. కష్టాల్లో ఉన్న స్నేహితుడి కుటుంబాన్ని ఆదుకునేందుకు ముందుకు వచ్చిన వారిని గ్రామస్థులు అభినందించారు.

ఇప్పేరు పొలాల్లో చిరుత సంచారం..!

కూడేరు, డిసెంబరు 9(ఆంధ్రజ్యోతి): మండలంలోని ఇప్పేరు గ్రామ సమీపంలోని పొలాల్లో చిరుత సంచరిస్తున్నట్లు ఆ గ్రామానికి చెందిన తిప్పారెడ్డి తెలిపారు. రెండ్రోజుల క్రితం తన తోటలో చిరుత కనిపించిందన్నారు. తమకు కూడా చిరుత కనిపించిందని పశువుల కాపరులు తెలిపారు. దీంతో పొలాలకు వెళ్లడానికి రైతులు జంకుతున్నారు. అటవీశాఖ అధికారులు స్పందించాలని ఆ గ్రామస్థులు కోరుతున్నారు.

టీడీపీ సీనియర్ నాయకుడి మృతి



మిద్దిగంగప్ప(ఫైల్)

రామగిరి, డిసెంబరు 9(ఆంధ్రజ్యోతి): మండలంలోని పేరూరు గ్రామానికి చెందిన టీడీపీ సీనియర్ నాయకుడు మిద్దెగంగప్ప(94) వృద్ధాప్య సమస్యలతో మంగళవారం మృతి చెందారు. దళిత సామాజిక వర్గానికి చెందిన ఇతను టీడీపీ ఆవిర్భావం నుంచి పార్టీకి వెన్నంటే ఉన్నారు. ఆయన కుమార్తె పార్టీ ఎంపీటీసీ సభ్యురాలిగా కొనసాగారు. ఆయన మృతదేహాన్ని పలువురు టీడీపీ నాయకులు సందర్శించి నివాళులర్పించారు. కుటుంబ సభ్యులను పరామర్శించారు.

పెన్షనర్ల సంఘం మాజీ అధ్యక్షుడు ..



నంబియార్(ఫైల్)

అనంతపురం ప్రెస్‌క్లబ్, డిసెంబరు 9(ఆంధ్రజ్యోతి) : ప్రభుత్వ పెన్షనర్ల సంఘం జిల్లా మాజీ అధ్యక్షుడు ఈసీఎస్ నంబియార్(80) మృతి చెందారు. అనారోగ్య సమస్యలతో కొంతకాలంగా బాధపడుతున్న ఆయన తపోవనంలోని స్వగృహంలో మంగళవారం మృతి చెందారు. పెన్షనర్ల సంఘం జిల్లా అధ్యక్షుడు పెద్దనగౌడ్ ఆధ్వర్యంలో పలువురు పెన్షనర్లు ఆయన మృతి పట్ల నివాళులర్పించారు. ఈ సందర్భంగా పెద్దనగౌడ్ మాట్లాడుతూ... నంబియార్ 2009 నుంచి 2011 వరకూ పెన్షనర్ల సంఘం జిల్లా అధ్యక్షుడిగా జిల్లాలోని పెన్షనర్లకు పలు రకాల సేవలందించారని గుర్తు చేశారు.

'సర్వీస్ టీచర్లు టెట్ రాయాలనడం తగదు'

అనంతపురం విద్య, డిసెంబరు 9 (ఆంధ్రజ్యోతి): సర్వీస్ టీచర్లు టెట్ రాయాలనడం అర్థరహితమని ఆపస్ ఉపాధ్యాయసంఘం జిల్లా అధ్యక్ష, ప్రధానకార్యదర్శులు గోపాల్‌రెడ్డి, వెంకటరత్నం మండిపడ్డారు. అనంతపురంరూరల్ మండలంలోని వివిధ పాఠశాలలను మంగళవారం వారు సందర్శించి అక్కడి సమస్యలను తెలుసుకున్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ డీఎస్సీ రాసి ఉత్తీర్ణత సాధించి ఉపాధ్యాయ ఉద్యోగం పొందిన వారిని ఇనేళ్లకు టెట్ రాసి తప్పనిసరిగా పాస్ కావాలని, లేదంటే ఉద్యోగాలనుంచి తొలగిస్తామని చెప్పడం ఎంతవరకు సమంజమని ప్రశ్నించారు. వెంటనే రాష్ట్రప్రభుత్వం సీరియస్‌గా తీసుకొని కేంద్రంపై ఒత్తిడి తీసుకొచ్చి సర్వీస్ టీచర్లలో ఉన్న మానసికొత్తిడిని తొలగించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో నాయకులు కుళ్లాయప్ప,రత్నమయ్య తదితరులు పాల్గొన్నారు.

దుర్గాంజనేయస్వామి సేవలో వీహెచ్‌పీ నాయకులు

శింగనమల, డిసెంబరు 9(ఆంధ్రజ్యోతి): మండలకేంద్రంలోని దుర్గాంజనేయస్వామి ఆలయాన్ని విశ్వహిందూ పరిషత్ జిల్లా అధ్యక్షుడు టీవీ రత్నమయ్యతో పాటు పలువురు నాయకులు మంగళవారం సందర్శించారు. ఈ సందర్భంగా స్వామివారిని దర్శించి ప్రత్యేక పూజలు, అర్చనలు చేయించారు. అనంతరం ఆలయ విశిష్టతను పూజారిని అడిగి తెలుసుకున్నారు.

రేషన్ బియ్యం సీజ్

తాడిపత్రి, డిసెంబరు 9(ఆంధ్రజ్యోతి): మండలంలోని చిన్నపొలమడ గ్రామంలో అక్రమంగా నిల్వ ఉంచిన 45 క్వింటాళ్ల రేషన్ బియ్యాన్ని మంగళవారం స్వాధీనం చేసుకున్నట్లు విజిలెన్స్ ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారి ఎస్ఐ నరేంద్ర, సివిల్‌సప్లై అధికారి ప్రసాద్ తెలిపారు. వాటిని గోడౌన్‌కు తరలించామని, ఓ వ్యక్తిపై కేసు నమోదు చేసి రూరల్ పోలీసులకు అప్పగించామని తెలిపారు.

మేదరిమెట్ట పేరును యథావిధిగా కొనసాగించాలి



సమావేశంలో మాట్లాడుతున్న మేదర సంఘం నాయకులు

అనంతపురం టౌన్, డిసెంబరు 9 (ఆంధ్రజ్యోతి): తిరుపతిలోని మేదరిమెట్ట ప్రాంతానికి అదే పేరును యథావిధిగా కొనసాగించాలని మేదరి సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పోలేపల్లి నాగరాజు డిమాండ్ చేశారు. నగరంలోని సంఘం జిల్లా కార్యాలయంలో మంగళవారం సంఘం రాష్ట్ర అధ్యక్షుడు గ్రంథి రామోజీ అధ్యక్షతన నిర్వహించిన సమావేశంలో పోలేపల్లి నాగరాజు మాట్లాడారు. తిరుపతిలోని మేదరిమిట్ట ప్రాంతానికి ఆ పేరును తొలగిస్తే రాష్ట్రంలోని మేదర్ల మనోభావాలు దెబ్బతింటాయన్నారు. స్వామివారికి సేవ చేసిన భాగ్యాన్ని మేదర్లకు దక్కే విధంగా కొనసాగించాలని కోరారు. తిరుపతిలో వాయువ్యదశలో మేదరిమెట్ట ప్రాంతం ఉందని, గతంలో మేదరులు ఈ ప్రాంతంలోనే గంపలు, బుట్టలు అల్లేవారని, అందుకే ఆ ప్రాంతానికి ఈ పేరు వచ్చిందని అన్నారు. తిరుమల వేంకటేశ్వరస్వామికి ఉపయోగపడే వెదురు అల్లికలు జరిపిన మేదరుల మనోభావాలు దెబ్బతినకుండా కాపాడాలని కోరారు. ఈ అంశంపై సీఎం చంద్రబాబు , మంత్రి నారా లోకేష్, టీటీడీ బోర్డు దృష్టికి తీసుకెళ్లనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో మేదరి సంఘం రాష్ట్ర కోశాధికారి వైకుంఠరావు, ప్రచార కార్యదర్శి సంజీవ రాయుడు, కార్యనిర్వాహక అధ్యక్షుడు ధర్మారావు, మహిళా విభాగం రాష్ట్ర అధ్యక్షురాలు తేజోవతి, ప్రధాన కార్యదర్శి సాగరిక, కోశాధికారి శోభారాణి, జిల్లా అధ్యక్షుడు రామచంద్ర తదితరులు పాల్గొన్నారు.

గ్రామ పంచాయతీ భవనాల నిర్మాణం వేగవంతమవ్వాలి: పీఆర్ ఎస్ఈ



సమావేశంలో మాట్లాడుతున్న ఎస్ఈ చిన్న సుబ్బరాయుడు

అనంతపురం న్యూటౌన్, డిసెంబరు 9 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో చేపట్టనున్న గ్రామ పంచాయతీ భవనాలు, హెల్త్ క్లీనిక్‌ల నిర్మాణాలను వేగవంతంగా పూర్తి చేసేలా చూడాలని పీఆర్ ఎస్ఈ చిన్న సుబ్బరాయుడు సిబ్బందిని ఆదేశించారు. స్థానిక పంచాయతీరాజ్ కార్యాలయంలోని తన చాంబర్‌లో మంగళవారం ఆయన జిల్లాలోని ఇంజనీర్లతో సమావేశం ఏర్పాటు చేసి మాట్లాడారు. ఎన్ఆర్‌జీఎస్ పనులకు సంబంధించి అవసరాలకు అనుగుణంగా ప్రపోజల్స్ ఇస్తే అనుమతులు తీసుకుంటామన్నారు. హెల్త్ క్లీనిక్‌ల నిర్మాణాలకు 15వ ఆర్థిక సంఘం నిధులతో పాటు మరో రెండు కేంద్ర నిధుల నుండి నిర్మాణాలకు శ్రీకారం చుట్టామన్నారు. ఎక్కడైనా నిర్మాణాలకు స్థల సమస్యలు ఉంటే జాబితా ఇవ్వాలని, అందుకు అనుగుణంగా తగిన చర్యలు చేపడతామని చెప్పారు. ఆర్‌డబ్ల్యూఎస్, పీఆర్ నిధుల ద్వారా ప్రతి నియోజవర్గ అభివృద్ధికి తగిన చర్యలు చేపట్టేలా చూడాలని సూచించారు. సమావేశంలో ఈఈ ప్రభాకర్‌రెడ్డి, డీఈలు లక్ష్మీనారాయణ, డీఎల్ మురళి, గురుమూర్తి, చంద్రకుమార్, క్రిష్ణజ్యోతి, రాజన్న, సుధాకర్‌నాయక్, రసూల్, తో పాటు ఏఈలు వెంకటశేషయ్య, బాషా, లక్ష్మీదేవి, తిరుపాల్ నాయక్ తదితరులు పాల్గొన్నారు.

సుబ్రహ్మణ్యేశ్వరుడికి ప్రత్యేక పూజలు



ప్రత్యేక అలంకరణలో సుబ్రహ్మణ్యేశ్వరుడు

ఆత్మకూరు డిసెంబరు 9 (ఆంధ్రజ్యోతి): మండలంలోని పంపనూరు సుబ్రహ్మణ్యేశ్వర స్వామి ఆలయంలో మంగళవారం ప్రత్యేక పూజలను ఘనంగా నిర్వహించారు. వేకువజామునే అర్చకులు ఆలయంలో స్వామి వారి మూలవిరాట్‌కు పలు అభిషేకాలు, అలంకరణలు చేశారు. అనంతరం ప్రత్యేక పూజలు చేసి మంగళహారతి ఇచ్చారు. భక్తులు పెద్దఎత్తున దర్శించుకుని తీర్థప్రసాదాలు స్వీకరించారు. ఆలయ కార్యనిర్వాహణాధికారి బాబు, ప్రధాన అర్చకుడు రామస్వామి, ఆలయ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

అనుమతిలేని ఫ్లెక్సీల తొలగింపు



అనుమతి లేని ఫ్లెక్సీలను తొలగిస్తున్న నగరపాలక సిబ్బంది

అనంతపురం క్లాక్‌టవర్, డిసెంబరు 9 (ఆంధ్రజ్యోతి): నగరంలో అనుమతి లేకుండా వెలసిన ఫ్లెక్సీలను నగరపాలక సంస్థ సిబ్బంది తొలగించారు. కమిషనర్ బాలస్వామి ఆదేశాల మేరకు నగరంలోని ప్రధాన కూడళ్లు, రహదారులలో అనధికారికంగా ఏర్పాటు చేసిన హోర్డింగ్‌లు, ఫ్లెక్సీలను సిబ్బంది మంగళవారం తొలగించారు. నగరపాలక సంస్థ అనుమతి లేకుండా నగరంలో ఫ్లెక్సీలు, హోర్డింగ్‌లు ఏర్పాటు చేస్తే వెంటనే తొలగించడంతో పాటు బాధ్యులపై శాఖాపరమైన చర్యలు తీసుకుంటామని కమిషనర్ హెచ్చరించారు.

విద్యార్థులకు దుస్తులు పంపిణీ



విద్యార్థులకు దుస్తులు పంపిణీ చేస్తున్న ఆలం వెంకట నరసానాయుడు

నార్పల, డిసెంబరు 9 (ఆంధ్రజ్యోతి): మండలంలోని బొందలవాడ గ్రామ ప్రభుత్వ పాఠశాల విద్యార్థులకు వెంకట్ వకుల ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఉప సర్పంచ్ ఆలం వెంకట నరసానాయుడు మంగళవారం దుస్తులు పంపిణీ చేశారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులు బాగా చదువుకుని ఉన్నత స్థాయికి ఎదగాలని ఆకాంక్షించారు. ఉపాధ్యాయులు, పంచాయతీ సెక్రెటరీ, వార్డు మెంబర్లు పాల్గొన్నారు.

బాధ్యతగా విధులు నిర్వర్తించాలి

అనంతపురం న్యూటౌన్, డిసెంబరు 9(ఆంధ్రజ్యోతి): విధులు బాధ్యతగా నిర్వర్తించాలని గార్లదిన్నె ఇన్‌చార్జి ఎంపీడీఓగా నియమితులైన గోపాల్‌కు జిల్లాపరిషత్ సీఈఓ వెంకటసుబ్బయ్య సూచించారు. ఇన్‌చార్జి ఎంపీడీఓ గోపాల్ జిల్లాకేంద్రంలోని జడ్పీ కార్యాలయంలో మంగళవారం జడ్పీ ఇన్‌చార్జి సీఈఓను మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందజేశారు. దీంతో అతను విధులు బాధ్యతగా నిర్వర్తించాలని సూచించారు. అక్కడి ఎంపీడీఓ యోగానందరెడ్డి వ్యక్తిగత పనులపై సెలవులో వెళ్లడంతో ఆ స్థానంలోకి డిప్యూటీ ఎంపీడీఓగా ఉన్న గోపాల్‌ను నియమించిన విషయం తెలిసిందే.

సిమెంట్ అక్రమాలపై విజిలెన్స్ దాడులు



తనిఖీలు చేస్తున్న అధికారులు

అనంతపురం క్రైం, డిసెంబరు9(ఆంధ్రజ్యోతి): సిమెంట్‌లో ఫ్లైయాష్ కలిపి విక్రయిస్తున్న కస్తూరి సిమెంట్స్ యూనిట్‌పై విజిలెన్స్, తూనికలు కొలతలశాఖ, వాణిజ్య పన్నులశాఖ అధికారులు మంగళవారం దాడులు నిర్వహించారు. శ్రీసత్యసాయి జిల్లా గోరంట్ల మండలం బూదిలి గ్రామంలో ఉన్న కస్తూరి యూనిట్‌లో విజిలెన్స్ ఆర్వీఈఓ ప్రసాద్, ఇతర అధికారులు ఆధ్వర్యంలో దాడులు చేశారు. ఆ యూనిట్‌కు పోర్టులాండ్ ఫొజోలానా సిమెంట్(పీపీసీ) కింద జీఎస్టీ రిజిస్ట్రేషన్ చేసుకున్నట్లు అధికారులు గుర్తించారు. ఫ్లైయాష్‌ను, పీపీసీని నిర్ణీత మోతాదు కంటే ఎక్కువ కలిపి నకిలీ సిమెంట్ తయారు చేసి అల్ట్రాటెక్ సిమెంట్ సంచుల్లో నింపి కర్ణాటకకు తరలించి అమ్ముతున్నట్టు అధికారులు గుర్తించారు. 340 సిమెంట్ బస్తాలతో కర్ణాటకకు తరలిస్తున్న లారీ(కెఏ53బీ3976)ని, అల్ట్రాటెక్ సిమెంట్ బ్రాండ్ నేమ్ ముద్రించిన మరో 88 ఖాళీ సంచులను అధికారులు సీజ్ చేసి, క్రిమినల్ కేసు నమోదు చేశారు. లీగల్ మెట్రాలజీ అధికారులు ఏడు కేసులు నమోదు చేశారు. తనిఖీల్లో విజిలెన్స్ డీఎస్పీ నాగభూషణం, సీఐలు శ్రీనివాసులు, ఎస్ఐ గోపాలుడు, ఏసీటీఓ రమేష్, లీగల్ మెట్రాలజీ ఇన్‌స్పెక్టర్ శంకర్, పొల్యూషన్ బోర్డు ఏఈ కృష్ణారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

14న రాష్ట్ర స్థాయి డ్యాన్స్, స్పోర్ట్స్ పోటీలు

అనంతపురం క్లాక్‌టవర్, డిసెంబరు 9 (ఆంధ్రజ్యోతి): 5వ రాష్ట్ర స్థాయి డ్యాన్స్ స్పోర్ట్స్ పోటీలు ఈనెల 14వతేదీన ఆర్డీటీ స్టేడియంలో నిర్వహించనున్నట్లు డ్యాన్స్, స్పోర్ట్స్ అసోసియేషన్ రాష్ట్ర కార్యదర్శి సురేంద్రరెడ్డి, జిల్లా కార్యదర్శి ధనుంజయ మంగళవారం ప్రకటనలో తెలిపారు. సబ్‌జూనియర్, జూనియర్, యూత్, సీనియర్ బాల, బాలికల కేటగిరిలలో పోటీలు ఉంటాయన్నారు. మరిన్ని వివరాలకు 7075041111ను సంప్రదించాలని కోరారు. ఉమ్మడి 13 జిల్లాల నుంచి బాల, బాలికలు హాజరవుతారని తెలిపారు.

ధనుర్మాసోత్సవాల బ్రోచర్ల విడుదల

అనంతపురం టౌన్, డిసెంబరు 9 (ఆంధ్రజ్యోతి) : తపోవనం శ్రీక్షేత్రంలోని లక్ష్మీ హయగ్రీవ లక్ష్మీ వేంకటేశ్వర, గోదా రంగనాథస్వామి ఆలయంలో ఈనెల 16 నుంచి జనవరి 13వ తేదీ వరకు నిర్వహించనున్న ధనుర్మాసోత్సవాలను విజయవంతం చేయాలని ఆలయ కమిటీ అధ్యక్షుడు జ్వాలాపురం శ్రీకాంత్ పిలుపునిచ్చారు. ఈ మేరకు మంగళవారం సాయంత్రం ఆలయ ఆవరణలో బ్రోచర్లను ఆవిష్కరించారు. కార్యక్రమంలో వడిగేపల్లి నరసింహాచార్యులు, జ్వాలాపురం సాయినాథ్, సుదర్శన్, మీనా, శైలజ, అర్చకుడు రాఘవేంద్రాచారి పాల్గొన్నారు.

దాడులు చేసిన వారిపై చర్యలు తీసుకోవాలి

నార్పల, డిసెంబరు 9(ఆంధ్రజ్యోతి): దళితులపై దాడులు చేసిన వారిని అరెస్టు చేసి కఠినంగా శిక్షించాలని దళిత గిరిజన సంఘాల జేఏసీ రాష్ట్ర అధ్యక్షుడు సాకే హరి డిమాండ్ చేశారు. మండలకేంద్రంలోని పోలీస్ స్టేషన్ ఎస్ఐ గౌతంను మంగళవారం ఆయన కలిసి మాట్లాడారు. ఇటీవల దళితులపై దాడులు, దౌర్జన్యాలు పెరిగిపోయాయన్నారు. దాడులు చేస్తున్న వారిని గుర్తించి కఠినంగా శిక్షించాలన్నారు. నెల రోజుల క్రితం ఇక్కడే దళిత సూర్యనారాయణపై 70 మంది కిరాతకంగా దాడి చేశారని, వారిపై ఏ చర్యలు తీసుకున్నారో తెలిపాలని డిమాండ్ చేశారు. నాయకులు గడ్డం నాగేపల్లి హనుమంతు, గంగయ్య, కుళ్లాయప్ప, మల్లికార్జున పాల్గొన్నారు.

న్యూస్ బాక్స్

నేమకల్లుకు బస్సు వచ్చిందోచ్



నేమకల్లుకు వచ్చిన ఆర్టీసీ బస్సు

బొమ్మనహాళ్, డిసెంబరు 9(ఆంధ్రజ్యోతి) మండలంలోని నేమకల్లు గ్రామానికి ఆర్టీసీ బస్సు సర్వీసును పునరుద్ధరించారు. ఈ గ్రామానికి బస్సు సౌకర్యం కల్పిస్తామని సీఎం చంద్రబాబు హామీ ఇచ్చి.. ఏడాదైనా.. అది అమలు కాలేదు. బస్సు సౌకర్యం లేకపోవడంతో ఆ గ్రామస్థులు, విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు పడేవారు. దీనిపై ఆంధ్రజ్యోతి సోమవారం ఓ కథనాన్ని ప్రచురించింది. స్పందించిన ఆర్టీసీ రీజనల్ చైర్మన్ పూల నాగరాజు మంగళవారం నుంచే ఆ గ్రామానికి బస్సు సౌకర్యాన్ని పునరుద్ధరించారు.

వాటర్‌ప్లాంట్ ప్రారంభం


వాటర్‌ప్లాంట్ ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే

తాడిపత్రి, డిసెంబరు 9(ఆంధ్రజ్యోతి): మండలంలోని సజ్జలదిన్నెలో ఎన్టీఆర్ సుజలస్రవంతి ఆర్వో వాటర్‌ప్లాంట్‌ను ఎమ్మెల్యే జేసీ అస్మిత్‌రెడ్డి మంగళవారం ప్రారంభించారు. వేసవికాలం వచ్చేనాటికి నాటికి ఏ గ్రామంలో తాగునీటి సమస్య ఉండకుండా చర్యలు తీసుకోవాలని అధికారులకు సూచించారు. అనంతరం గ్రామంలో పర్యటిస్తూ.. సమస్యలపై ఆరా తీశారు. ఆయన వెంట ఎస్వీ రవీంద్రారెడ్డి, శాలివాహన కుమ్మర సంఘం డైరెక్టర్ వెంకటసుబ్బయ్య, కేశవరెడ్డి, దుబ్బన్న, పెద్దయ్య, అక్కిరెడ్డి, గోవర్ధన్‌రెడ్డి ఉన్నారు.

సమయపాలన పాటించని సచివాలయ ఉద్యోగులు

12 గంటలైనా విధులకు హాజరు కాని వైనం

వజ్రకరూరు(ఉరవకొండ), డిసెంబరు 9(ఆంధ్రజ్యోతి): వజ్రకరూరు మండలం చిన్నహోతూరు గ్రామంలోని సచివాలయ ఉద్యోగులు సమయపాలన పాటించడం లేదు. మంగళవారం మధ్యాహ్నం 12 గంటలైనా 10 మందికి గాను కేవలం ఐదుగురు మాత్రమే విధులకు వచ్చారు. వీఆర్వో, వెల్ఫేర్ అసిస్టెంట్, ఇంజనీరింగ్ అసిస్టెంట్, డిజిటల్ అసిస్టెంట్, మహిళా పోలీసు మాత్రమే విధులకు వచ్చారు. పంచాయతీ కార్యదర్శితో సహా మిగిలిన నలుగురు విధులకు రాలేదు. ఏఎస్ఎం వచ్చి సర్వేకు వెళ్లిందని సిబ్బంది తెలిపారు. పనులపై వచ్చిన ప్రజలు మధ్యాహ్నం వరకు వేచి చూసి.. నిరాశతో వెనుతిరిగారు. ఈ గ్రామం మండలానికి చివర ఉండడంతో ఇక్కడ సిబ్బంది ఇష్టారాజ్యంగా విధులకు హాజరవుతున్నారనే విమర్శలున్నాయి. దీనిపై డిప్యూటీ ఎంపీడీవో గౌస్ సాహెబ్‌ను వివరణ కోరగా విధుల పట్ల సిబ్బంది అలసత్వం వహిస్తే చర్యలు తీసుకుంటామన్నారు.

డిప్యూటీ ఎంపీడీవో బాధ్యతల స్వీకరణ


సమీర్‌ఖాన్

బ్రహ్మసముద్రం, డిసెంబరు 9 (ఆంధ్రజ్యోతి) : మండల పరిషత్ కార్యాలయంలో డిప్యూటీ ఎంపీడీవోగా సమీర్‌ఖాన్ మంగళవారం బాధ్యతలు చేపట్టారు. కదిరి మండల పరిషత్ కార్యాలయంలో సీనియర్ సహాయకులుగా పని చేస్తున్న ఆయన ఉద్యోగోన్నతిపై ఇక్కడికి వచ్చారు.

అధికలోడు వాహనాలను నివారించండి

యల్లనూరు, డిసెంబరు 9(ఆంధ్రజ్యోతి): మండలంలో చిత్రావతి నుంచి అధిక ఇసుక లోడ్ వాహనాలు వెళ్తున్నాయని, దీంతో రోడ్లు దెబ్బతింటున్నాయని, అలాంటి వాహనాలను నివారించాలని జడ్పీటీసీ ప్రతాప్‌రెడ్డి తహసీల్దార్ రాముకు మంగళవారం వినతిపత్రం అందజేశారు. ఆ వాహనాలు అధిక వేగంగా తాడిపత్రి-యల్లనూరు ప్రధానరహదారిపై వెళ్తుండటంతో బైక్‌లపై వెళ్లాలన్నా ఇబ్బందిగా ఉంటోందన్నారు.

ప్రధాన రహదారిలో మురుగునీరు

వజ్రకరూరు(ఉరవకొండ), డిసెంబరు 9(ఆంధ్రజ్యోతి): వజ్రకరూరు మండలం గడేహోతూరులో మురుగు కాలువలు లేకపోవడంతో రోడ్డు పైనే మురుగు నీరు ప్రవహిస్తోంది. అక్కడక్కడ రహదారిపైనే ఆ నీరు నిల్వ ఉంటోంది. ప్రధాన రహదారిలోని గాంధీ విగ్రహం చుట్టూ అపరిశుభ్రత నెలకొంది. సచివాలయానికి ఈ విగ్రహం కూతవేటు దూరంలో ఉన్నా అధికారులకు మాత్రం మురుగు నీటి సమస్యను పట్టించుకోవడం లేదు. గ్రామంలో మురుగు కాలువల నిర్మాణానికి నిధులున్నా అధికారులు ఆ సమస్యను పరిష్కరించేలా చర్యలు తీసుకోకపోవడం పలు విమర్శలకు తావిస్తోంది. ఇప్పటికైనా అధికారులు స్పందించి గ్రామంలో మురుగు కాలువలు ఏర్పాటు చేయాలని ఆ గ్రామస్థులు కోరుతున్నారు.


ప్రధాన రహదారిపై నిల్వ ఉన్న మురుగు నీరు

రోడ్డు విస్తరణకు చర్యలు

కుందుర్పి, డిసెంబరు 9(ఆంధ్రజ్యోతి): స్థానిక పెట్రోల్ బంక్ నుంచి కస్తూరిబా పాఠశాల వరకు ఉన్న రోడ్డును 60 అడుగుల మేర విస్తరించే పనులకు మంగళవారం శ్రీకారం చుట్టారు. కళ్యాణదుర్గం డివిజన్ రోడ్ల భవనాల శాఖ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ చంద్రశేఖర్ ఆధ్వర్యంలో రోడ్డుకు ఇరువైపులా అడ్డంగా ఉన్న భవనాలకు మార్కింగ్ వేయించారు. ఐదు రోజుల క్రితం మండలంలో ఎమ్మెల్యే అమిలినేని సురేంద్రబాబు పర్యటించగా.. రోడ్డు సమస్య పరిష్కరించాలని స్థానికులు ఆయన్ను కోరారు. ఆయన ఆదేశాల మేరకు అధికారులు ఈ విస్తరణ పనులు చేపట్టారు.


కొలతలు తీసుకుంటున్న సిబ్బంది

పంచాయతీ నిధులు దుర్వినియోగం

వైసీపీ సర్పంచు, కార్యదర్శి కుమ్మక్కై, అవినీతి..!

వజ్రకరూరు (ఉరవకొండ), డిసెంబరు 9 (ఆంధ్రజ్యోతి): వజ్రకరూరు మండలం గడేహోతూరు పంచాయతీ పంచాయతీలో తాగునీరు, డ్రైనేజీ పనులకు ఉపయోగించాల్సిన రూ. మూడు లక్షల పంచాయతీ నిధులను వైసీపీ సర్పంచు, కార్యదర్శి కుమ్మక్కై .. అవసరం లేని చోట మట్టి రోడ్డు వేయించి .. దుర్వినియోగం చేశారని టీడీపీ నాయకుడు వన్నూరుస్వామి మండిపడ్డారు. తీర్మానాలు లేకుండానే 15వ ఆర్థిక సంఘం నిధులతో ఈ పనులు చేపట్టారని ఆయన మంగళవారం ధ్వజమెత్తారు. ప్యాపిలి రస్తా నుంచి పాఠశాలకు వెళ్లే రహదారి దెబ్బతిందని, కనీసం దాన్ని అయినా బాగు చేయకుండా.. ఎవరికీ ఉపయోగపడని చోట ఈ రోడ్డు పనులు చేయించారని అన్నారు. సర్పంచు సురేంద్ర, కార్యదర్శి సుబాన్‌జీ కుమ్మక్కై నిధులు స్వాహా చేశారని ఆరోపించారు. ఈ విషయాన్ని ఎంపీడీవో శివాజీరెడ్డి దృష్టికి తీసుకెళ్లినట్లు తెలిపారు. దీనిపై కార్యదర్శి సుబాన్‌జీని వివరణ కోరగా.. తీర్మానం చేయలేదని, సర్పంచు వినతి పత్రం ఇవ్వడంతో ఆ రోడ్డు పనులు చేపట్టామని అన్నారు.


ప్యాపిలికి వెళ్లే దారిలో వేసిన మట్టి రోడ్డు

దమ్ముంటే.. కబ్జాదారుల పేర్లు చెప్పండి

మాజీ ఎమ్మెల్యే పెద్దారెడికి టీడీపీ కౌన్సిలర్ల సవాల్


సమావేశంలో మాట్లాడుతున్న టీడీపీ కౌన్సిలర్లు

తాడిపత్రి, డిసెంబరు 9(ఆంధ్రజ్యోతి): పట్టణ శివార్లలోని ఎర్రవంకను టీడీపీ నాయకులు కబ్జా చేశారని మాజీ ఎమ్మెల్యే పెద్దారెడ్డి గత సోమవారం గ్రీవెన్స్‌లో కలెక్టర్‌కు ఫిర్యాదు చేయడంపై స్థానిక టీడీపీ నాయకులు మండిపడ్డారు. స్థానిక మున్సిపల్ కార్యాలయంలో కౌన్సిలర్లు మల్లికార్జున, షెక్షావలి, విజయ్‌కుమార్, జింకా లక్ష్మీదేవి, అరుణ, పర్వీన్ మంగళవారం మాట్లాడారు. పెద్దారెడ్డికి దమ్ము, ధైర్యం ఉంటే ఎర్రవంకను కబ్జా చేసిన వారి పేర్లను చెప్పాలని, తామే వారిపై చర్యలు తీసుకుంటామని, లేకుంటే పట్టణంలోని పెద్దారెడ్డి తండ్రి విగ్రహం వద్ద ధర్నా చేస్తామని వారు హెచ్చరించారు. కబ్జాల గురించి పెద్దారెడ్డి మాట్లాడుతుండటం దయ్యాలు వేదాలు వల్లించినట్లు ఉందని ఎద్దేవా చేశారు. పుట్లూరు మండలం కోమటికుంట్లలో పెద్దారెడ్డి తోట పక్కన ఉన్న ప్రభుత్వ భూమిని, వంకను కబ్జా చేశాడని, దీనిపై తాము కలెక్టర్‌కు ఫిర్యాదు చేయడంతో ఆ భూమిని అధికారులు తిరిగి స్వాధీనం చేసుకున్నారన్నారు. అలాగే పట్టణంలో మున్సిపాలిటీకి సంబంధించిన రెండు సెంట్ల స్థలాన్ని కబ్జా చేసి భవనాన్ని నిర్మించుకున్నారని, దీనిపై మున్సిపల్ అధికారులు నోటీసులు కూడా పెద్దారెడ్డికి ఇచ్చారని తెలిపారు. ఈ విషయాలను అప్పుడే మరచిపోయావా పెద్దారెడ్డీ అన్ని ప్రశ్నించారు.

విద్యుత్ బిల్లుపై నిరసన


ర్యాలీ నిర్వహిస్తున్న రైతు సంఘం నాయకులు

పెద్దవడుగూరు, డిసెంబరు 9(ఆంధ్రజ్యోతి): కేంద్రప్రభుత్వం ప్రవేశపెట్టిన విద్యుత్ సవరణల బిల్లు కార్పొరేట్ సంస్థల లబ్ధి చేకూర్చేలా ఉందని రైతు సంఘం నాయకులు మండిపడ్డారు.ఈ మేరకు మంగళవారం మండలకేంద్రంలో నిరసన ర్యాలీ చేపట్టారు. జిల్లా సహాయ కార్యదర్శి దస్తగిరి మాట్లాడుతూ.. కేంద్ర ప్రభుత్వం విద్యుత్ బిల్లు 2025 ప్రకారం దేశవ్యాప్తంగా ప్రభుత్వ రంగంలో ఉన్న అన్ని విద్యుత్ పంపిణీ సంస్థలు ప్రైవేట్ పరం అవుతున్నాయన్నారు. దీనివల్ల వ్యవసాయ రంగానికి ఉచిత విద్యుత్ ఉండదన్నారు. దీంతోపాటు గృహ విద్యుత్ వినియోగదారులకు ఇప్పటికే ఉన్న విద్యుత్ ఛార్జీలకు అదనంగా మరింత భారం పడుతుందని తెలిపారు. విద్యుత్ అంశం రాష్ట్రాల పరిధిలో ఉంటుందని, అయినా కేంద్ర ప్రభుత్వం ఈ బిల్లును రూపొందించడం రాష్ట్రాల హక్కులను కాలరాయడమేనని ధ్వజమెత్తారు. ఈ కార్యక్రమంలో రైతు సంఘం నాయకులు ఈశ్వర్‌రెడ్డి, సుధీర్‌రెడ్డి, ఓబులేసు, హనుమంతురెడ్డి, సూర్యనారాయణగౌడ్ పాల్గొన్నారు.

అంతర్జాతీయ అవినీతి వ్యతిరేక దినోత్సవం

రాయదుర్గం రూరల్, డిసెంబరు 9(ఆంధ్రజ్యోతి): స్థానిక రాజీవ్‌గాంధీకాలనీలోని భారత్ ఐటీఐ కళాశాలలో మంగళవారం అంతర్జాతీయ అవినీతి వ్యతిరేక దినోత్సవాన్ని నిర్వహించినట్లు ఆమ్ ఆద్మీ పార్టీ జిల్లా కన్వీనర్ వెంకటరమణబాబు తెలిపారు. అవినీతి రహిత సమాజ నిర్మాణానికి కృషి చేస్తామని విద్యార్థులు ప్రతిజ్ఞ చేశారు. కార్యక్రమంలో ఆప్ పట్టణ కన్వీనర్ ఎస్‌కే అబ్దుల్లా, ఐటీఐ ప్రిన్సిపాల్ బాషా పాల్గొన్నారు.

యూటీఎఫ్ కార్యవర్గం ఏర్పాటు

బొమ్మనహాళ్, డిసెంబరు 9(ఆంధ్రజ్యోతి): ఆంధ్రప్రదేశ్ ఐక్య ఉపాధ్యాయ ఫెడరేషన్ మండలం కార్యవర్గాన్ని జిల్లా అధ్యక్షుడు గోవిందరాజులు ఆధ్వర్యంలో మంగళవారం ఎన్నుకున్నారు. గౌరవ అధ్యక్షుడిగా ఎస్ రాఘవేంద్రరావు, అధ్యక్షుడిగా పవన్‌మురళి, సహ అధ్యక్షులుగా వాణిశ్రీ, కట్టె బసప్ప, ప్రధాన కార్యదర్శిగా ఆంజనేయులు, కోశాధికారిగా రవివర్మ అలాగే కార్యదర్శులు, జిల్లా కౌన్సిలర్లను ఎన్నుకున్నారు.

ప్రకృతి వ్యవసాయంపై అవగాహన

శెట్టూరు, డిసెంబరు 9(ఆంధ్రజ్యోతి): మండలంలోని యాటకల్లు గ్రామంలో రైతులకు ప్రకృతి వ్యవసాయంపై మండల టీం లీడర్ రమేష్ మంగళవారం అవగాహన కల్పించారు. రసాయనిక ఎరువుల వాడకంతో కలిగే నష్టాలు.. ప్రకృతి వ్యవసాయం వల్ల కలిగే లాభాలను వివరించారు.

స్టడీ మెటీరియల్ పంపిణీ

శెట్టూరు, డిసెంబరు 9(ఆంధ్రజ్యోతి): మండలంలోని 12 పాఠశాలల్లోని 600 మంది పదో తరగతి విద్యార్థులకు ఎస్టీయూ ఆధ్వర్యంలో రూ. 48 వేలు విలువ చేసే స్టడీ మెటీరియల్‌ను మంగళవారం పంపిణీ చేశారు. వీటిని తహసీల్దార్ ఈశ్వరమ్మ, ఎంఈఓ శ్రీధర్, శెట్టూరు ఉన్నత పాఠశాల హెచ్ఎం ఫిరోజ్ ఆవిష్కరించారు.

ఇప్పేరు పొలాల్లో చిరుత సంచారం..!

కూడేరు, డిసెంబరు 9(ఆంధ్రజ్యోతి): మండలంలోని ఇప్పేరు గ్రామ సమీపంలోని పొలాల్లో చిరుత సంచరిస్తున్నట్లు ఆ గ్రామానికి చెందిన తిప్పారెడ్డి తెలిపారు. రెండ్రోజుల క్రితం తన తోటలో చిరుత కనిపించిందన్నారు. తమకు కూడా చిరుత కనిపించిందని పశువుల కాపరులు తెలిపారు. దీంతో పొలాలకు వెళ్లడానికి రైతులు జంకుతున్నారు. అటవీశాఖ అధికారులు స్పందించాలని ఆ గ్రామస్థులు కోరుతున్నారు.

శ్మశాన వాటికకు భూమి కేటాయిస్తాం : ఎమ్మెల్యే


పీఠాధిపతి కళ్యాణస్వామిని సన్మానిస్తున్న ఎమ్మెల్యే అమిలినేని

కళ్యాణదుర్గం, డిసెంబరు 9(ఆంధ్రజ్యోతి): పట్టణంలో వీరశైవ లింగాయత్తు శ్మశాన వాటికకు స్థలం కేటాయించాలని విరక్తి గవిమఠం పీఠాధిపతి కళ్యాణస్వామి, ఆ సామాజిక వర్గం వారు స్థానిక ప్రజావేదికలో ఎమ్మెల్యే అమిలినేని సురేంద్రబాబుని మంగళవారం విజ్ఞప్తి చేశారు. శ్మశాన వాటికకు తప్పకుండా స్థలం కేయిస్తామని ఎమ్మెల్యే వారికి భరోసా ఇచ్చారు. సుత్తూరు జాతర మహోత్సవం, ఉచిత సామూహిక వివాహాలకు ఎమ్మెల్యేను కళ్యాణస్వామి ఈ సందర్భంగా ఆహ్వానించారు. ఎమ్మెల్యే పీఠాధిపతిని ఘనంగా సన్మానించారు.

నల్లలమ్మకు బోనాలు



కూడేరు, డిసెంబరు 9(ఆంధ్రజ్యోతి) : కూడేరులో నల్లలమ్మ దేవత విగ్రహాన్ని ప్రతిష్ఠించి 41 రోజులు పూర్తయిన సందర్భంగా.. భక్తులు మంగళవారం భక్తిశ్రద్ధలతో అమ్మవారికి బోనాలు సమర్పించారు. అమ్మవారికి ప్రత్యేక అలంకరణ చేసి.. పూజలు నిర్వహించారు.

గ్రామ పంచాయతీల విభజనకు సన్నాహాలు


భోగాలకట్టలో మాట్లాడుతున్న పంచాయతీ కార్యదర్శి సుమలత

యాడికి, డిసెంబరు 9(ఆంధ్రజ్యోతి): యాడికి మండలంలో గ్రామ పంచాయతీల విభజనకు అధికారులు సన్నాహాలు ప్రారంభించారు. అందులో భాగంగా భోగాలకట్ట గ్రామంలో పంచాయతీ కార్యదర్శి సుమలత గ్రామసభ నిర్వహించారు. ప్రస్తుతం యాడికి మండలంలో 14 గ్రామ పంచాయతీలుండగా... వాటిని 16 నుంచి 17 గ్రామ పంచాయతీలుగా మార్చే ఆలోచనలో అధికారులున్నారు. ప్రస్తుతం కమలపాడు గ్రామ పంచాయతీలోని చింతలాయపల్లి, బోయరెడ్డిపల్లి గ్రామాలను, నగరూరు గ్రామ పంచాయతీలోని భోగాలకట్ట గ్రామాన్ని, నగరూరు గ్రామ పంచాయతీలోని భోగాలకట్ట గ్రామాన్ని ప్రత్యేక గ్రామ పంచాయతీ చేయాలని ఉన్నారు. యాడికి గ్రామపంచాయతీలోని పిన్నేపల్లి, కత్తిమానుపల్లి, గుడిసెలు గ్రామాలను కలిపి ఒక గ్రామ పంచాయతీగా మార్చే దిశగా అధికారులు చర్యలు చేపడుతున్నారు.

సచివాలయం తనిఖీ

యాడికి, డిసెంబరు 9(ఆంధ్రజ్యోతి): రాయలచెరువు సచివాలయాన్ని ఎంపీడీఓ వీరరాజు మంగళవారం తనిఖీ చేశారు. పనివేళల్లో ప్రజలకు అందుబాటులో ఉండాలని, విధులను ఎవరైనా నిర్లక్ష్యం వహిస్తే చర్యలు తప్పవని సిబ్బందిని హెచ్చరించారు.

● శెట్టూరు : స్థానిక గ్రామ సచివాలయాన్ని డిప్యూటీ ఎంపీడీవో సరిత మంగళవారం తనిఖీ చేశారు. సిబ్బంది హాజరు పుస్తకాన్ని పరిశీలించారు. మూమెంట్ రిజిస్టర్ తప్పక నిర్వహించాలన్నారు.

నూతన కార్యవర్గం ఏర్పాటు

గుంతకల్లు, డిసెంబరు 9(ఆంధ్రజ్యోతి): స్థానిక యునైటెడ్ క్రిస్టియన్ వెల్ఫేర్ ఫోరం నూతన కార్యవర్గాన్ని స్థానిక బేరియా ఏజీ చర్చిలో మంగళవారం ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా పీపీ ఇమ్మాన్యుయేలు, ఉపాధ్యక్షుడిగా రెవరెండ్ ఏ చౌరప్ప, ప్రధాన కార్యదర్శిగా రెవరెండ్ ఏపీ సాల్మన్ విజయరాజు, కమిటీ సభ్యులను ఎన్నుకున్నారు. రెవరెండ్ బీ నెహెమ్యా ఈ ఎన్నికలకు అధికారిగా వ్యవహరించారు.

రిటైర్డ్ హెడ్ నర్సు మృతి


ప్రమీలమ్మ (ఫైల్)

గుత్తి, డిసెంబరు 9(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని ప్రభుత్వ ఆసుపత్రిలో సుదీర్ఘంగా వైద్య సేవలందించి రిటైర్ట్ అయిన హెడ్ నర్సు ప్రమీలమ్మ(84) అనారోగ్యంతో మంగళవారం మరణించారు. వారం రోజులుగా అనారోగ్యంతో బాధపడుతున్న ఆమె అనంతపురంలో చికిత్స పొందుతూ మరణించారు. ఆమె మృతికి రాజకీయ పార్టీల నాయకులు, వైద్య సిబ్బంది, అధ్యాపకులు సంతాపం వ్యక్తం చేశారు.

344 మంది రిజిస్ట్రేషన్

రాయదుర్గం రూరల్, డిసెంబరు 9(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వం రైతుకు అందిస్తున్న వేరుశనగ కోసం ఇప్పటిదాకా 344 మంది రైతులు పేర్లను నమోదు చేసుకున్నట్లు ఏఓ అహ్మద్‌బాషా మంగళవారం తెలిపారు. రాయితీ విత్తనాలను రైతులు సద్వినియోగం చేసుకోవాలన్నారు.

ఇన్‌ఫ్లో 2,550 క్యూసెక్కులు

బెళుగుప్ప, డిసెంబరు 9 (ఆంధ్రజ్యోతి): మండలంలోని జీడిపల్లి రిజర్వాయర్‌కు ఇన్‌ఫ్లో 2,550, ఔట్‌ఫ్లో 2,550 క్యూసెక్కులు ఉన్నట్లు హంద్రీనీవా అధికారులు మంగళవారం తెలిపారు. ప్రస్తుతం రిజర్వాయర్‌లో 1.737 టీఎంసీల నీరు ఉందని, ఇక్కడి నుంచి ఫేజ్-2కు 1,681 క్యూసెక్కులు నీరు వెళ్తోందని తెలిపారు.

జాతీయ క్రీడాకారులకు సన్మానం

గుంతకల్లు / టౌన్, డిసెంబరు 9(ఆంధ్రజ్యోతి): జాతీయ క్రికెట్ జట్టుకు ఎంపికైనా విద్యార్థినులు, అక్కాచెల్లెళ్లు అమూల్య, నందినని, వారి తల్లిదండ్రులను స్థానిక త్యాగరాజ స్వామి దేవాలయంలో మంగళవారం ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో నాయీబ్రాహ్మణ సేవా సంఘం అధ్యక్షుడు లక్ష్మీనారాయణ, కార్యదర్శి వేణుగోపాల్, సభ్యులు బీ మాణిక్యం, రమేష్ బాబు, శ్రీనివాసులు, వీరాంజనేయులు, రవికుమార్, వెంకటేశులు, త్యాగరాజు, మల్లన్న, బీసీ గోవిందరాజులు పాల్గొన్నారు.

● పరుగు పోటీల్లో.. : ఉత్తర ప్రదేశ్ రాష్ట్ర రాజధాని లక్నోలో ఈనెల 13 నుంచి 17వ తేదీ వరకూ నిర్వహించే జాతీయస్థాయి పరుగు పోటీల్లో మండలానికి చెందిన విద్యార్థులు ఏ ఇంద్రలేఖ, ఏ వర్షిత, టీ రాజేశ్ పాల్గొంటున్నారు. వీరిని టీడీపీ నాయకుడు గుమ్మనూరు నారాయణ స్వామి మంగళవారం ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో కోచ్‌లు దామోదర రెడ్డి, దొరైరాజు, టీడీపీ నాయకులు రంగన్న, ట్యాంకర్ శివ, రామప్ప పాల్గొన్నారు.



అక్కాచెల్లెళ్లను సన్మానిస్తున్న నాయకులు, క్రీడాకారులను సన్మానిస్తున్న గుమ్మనూరు నారాయణస్వామి

క్రైం న్యూస్ ..

ఇద్దరికి తీవ్రగాయాలు

యాడికి, డిసెంబరు 9 (ఆంధ్రజ్యోతి): మండలంలోని రాయలచెరువులో ద్విచక్రవాహనాలు ఢీకొని ఇద్దరు వ్యక్తులు తీవ్రంగా మంగళవారం తీవ్రంగా గాయపడ్డారు. యాడికి మండలం లక్షుంపల్లి గ్రామానికి చెందిన శ్రీనివాసులు, గుత్తి మండలం జక్కలచెరువు గ్రామానికి చెందిన వినోద్ బైక్‌లపై వెళ్తూ.. రాయలచెరువులో ఎదురెదురుగా ఢీకొన్నారు. శ్రీనివాసులు తీవ్రంగా, వినోద్‌కు స్వల్పంగా గాయపడ్డారు. వారిని స్థానిక ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు.

అన్నదమ్ముల ఘర్షణ

బెళుగుప్ప, డిసెంబరు 9 (ఆంధ్రజ్యోతి): మండలంలోని బెళుగుప్ప తండాలో మంగళవారం భూతగాదాలో అన్నదమ్ముల మధ్య ఘర్షణ జరిగింది. ఒకరికొకరు మారణాయుధాలతో దాడి చేసుకోవడంతో ఇద్దరూ గాయపడ్డారు. ఇది సోషల్ మీడియాలో వైరల్ అయ్యింది. గాయపడ్డవారు కళ్యాణదుర్గంలో చికిత్స పొందుతున్నారు.

రేషన్ బియ్యం సీజ్

తాడిపత్రి, డిసెంబరు 9(ఆంధ్రజ్యోతి): మండలంలోని చిన్నపొలమడ గ్రామంలో అక్రమంగా నిల్వ ఉంచిన 45 క్వింటాళ్ల రేషన్ బియ్యాన్ని మంగళవారం స్వాధీనం చేసుకున్నట్లు విజిలెన్స్ ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారి ఎస్ఐ నరేంద్ర, సివిల్‌సప్లై అధికారి ప్రసాద్ తెలిపారు. వాటిని గోడౌన్‌కు తరలించామని, ఓ వ్యక్తిపై కేసు నమోదు చేసి రూరల్ పోలీసులకు అప్పగించామని తెలిపారు.

జూదరుల అరెస్టు

బొమ్మనహాళ్, డిసెంబరు, 9(ఆంధ్రజ్యోతి) మండలంలోని దర్గాహొన్నూరు గ్రామ శివారులో పేకాట ఆడుతున్న ముగ్గురిని మంగళవారం అరెస్ట్ చేసినట్లు ఎస్ఐ నబీరసూల్ తెలిపారు. వారి నుంచి రూ. 39,500 నగదు, మూడు మొబైల్స్, ద్విచక్రవాహనం స్వాధీనం చేసుకున్నామని, కేసు నమోదు చేసి కోర్టుకు హాజరు పరుస్తామని తెలిపారు. మరో పది మంది పరారీలో ఉన్నారన్నారు.

కాలనీల్లో విస్తృత తనిఖీ

పలు వాహనాలు, మద్యం స్వాధీనం


జయనగర్ కాలనీలో సీఐ, పోలీసుల తనిఖీ

కళ్యాణదుర్గం, డిసెంబరు9(ఆంధ్రజ్యోతి): పట్టణంలో రెండు రోజుల నుంచి పోలీసులు పట్టణ సీఐ హరినాథ్ ఆధ్వర్యంలో పలు కాలనీల్లో ప్రత్యేక తనిఖీలు చేపట్టారు. కార్డన్ అండ్ సర్చ్ ఆపరేషన్ పేరుతో పట్టణంలోని జయనగర్, బొట్టువాని కాలనీల్లో రౌడీషీటర్లు, అనుమానాస్పద వ్యక్తుల నివాసాలను తనిఖీ చేశారు. రికార్డులు సక్రమంగా లేని 90 ద్విచక్రవాహనాలు, 22 ఆటోలను, 14 మద్యం బాటిళ్లను స్వాధీనం చేసుకున్నట్లు డీఎస్పీ రవిబాబు మంగళవారం తెలిపారు. ఎవరైనా అనుమానాస్పద వ్యక్తులు కనిపిస్తే.. వెంటనే పోలీసులకు సమాచారం అందించాలని సూచించారు.

టీడీపీ నాయకులు సమన్వయంతో పనిచేయాలి


ఆదినారాయణకు వినతి పత్రం ఇస్తున్న నాయకులు

కణేకల్లు, డిసెంబరు 9(ఆంధ్రజ్యోతి): టీడీపీ నాయకులు సమన్వయంతో పనిచేసి వచ్చే స్థానిక సంస్థల ఎన్నికల్లో పార్టీ అభ్యర్థులను గెలిపించాలని మండల పరిశీలకుడు ఆదినారాయణ పేర్కొన్నారు. మంగళవారం కణేకల్లు క్రాసింగ్‌లో నాయకులతో ఆయన సమావేశమయ్యారు. గత శాసనసభ ఎన్నికల్లో టీడీపీకి ఓటు తక్కువ వచ్చిన బూత్‌కమిటీ నాయకులతో కారణాలను విశ్లేషించారు. బూత్ లెవల్లో ఉన్న సమస్యలు పరిష్కరించాలని స్థానిక టీడీపీ నాయకులు ఆదినారాయణకు వినతి పత్రం అందజేశారు. కార్యక్రమంలో కన్వీనర్ వన్నారెడ్డి, నాయకులు లాలెప్ప, ఆనంద్‌రాజ్, సుదర్శన్, బీటీ రమేష్, చంద్రశేఖర్‌గుప్తా, అనిల్, చాంద్‌బాషా, మాబుసాబ్, ప్రభాకర్, జిలాన్ పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో శ్రీదుర్గా హోమం


హోమం నిర్వహిస్తున్న అర్చకులు

రాయదుర్గంరూరల్, డిసెంబరు 9(ఆంధ్రజ్యోతి): మండలంలోని మల్లాపురంలో శ్రీలక్ష్మీనరసింహస్వామి దేవాలయంలోని విశ్వమాత ఆశ్రమంలో శ్రీదుర్గామాత హోమాన్ని మంగళవారం ఘనంగా నిర్వహించారు. ఆలయ కమిటీ గౌరవ అధ్యక్షుడు రామ్మూర్తిస్వామి ఆధ్వర్యంలో ప్రధాన అర్చకులు సుబ్రహ్మణ్యంస్వామి సుప్రభాతసేవ, పుష్పాలంకరణ చేశారు. అనంతరం దుర్గామాత హోమాన్ని నిర్వహించారు. అర్బన్ సీఐ జయనాయక్ ఈ పూజల్లో పాల్గొన్నారు.

కానిస్టేబుల్‌కు ఆర్థికసాయం

గుంతకల్లుటౌన్, డిసెంబరు 9(ఆంధ్రజ్యోతి): స్థానిక డీఎస్పీ కార్యాలయంలో కానిస్టేబుల్ రమేష్ కిడ్నీ మార్పిడి కోసం గుంతకల్లు డీఎస్పీ శ్రీనివాస్ రూ. 15 వేలను మంగళవారం అందజేశారు. ఇందులో కానిస్టేబుళ్లు, సిబ్బంది పాల్గొన్నారు.

ల్యాబ్‌ను యాథావిధిగా కొనసాగించాలి

గుంతకల్లుటౌన్, డిసెంబరు 9(ఆంధ్రజ్యోతి): స్థానిక ప్రభుత్వ ఏరియా ఆసుపత్రిలో కింద ఉన్న పరీక్ష కేంద్రాన్ని పై అంతస్తులోకి మార్చారని, దీంతో గర్భిణులు, వికలాంగులు, వృద్ధులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని ఐద్వా నాయకులు అన్నారు. ఆ ల్యాబ్‌ను యధావిధిగా కిందనే నిర్వహించాలని ఐద్వా పట్టణ అధ్యక్షురాలు జ్యోతి డిమాండ్ చేశారు. ఈ మేరకు ఆ ఆస్పత్రి వద్ద మంగళవారం నిరసన వ్యక్తం చేశారు. సూపరింటెండెంట్ జయవర్ధన్ రెడ్డికి వినతి పత్రం అందజేశారు. ఇందులో ఐద్వా నాయకురాలు ప్రేమ, సరస్వతి, గంగరత్న, తులసీ, జాక్ సమీర్, సాయి, పవన్, పాల్గొన్నారు.


నిరసన వ్యక్తం చేస్తున్న ఐద్వా నాయకురాలు